# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
17-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 57

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## చర్లపల్లి జైలుకు భగీరథ్

### పోక్సో కేసులో అరెస్టు చేసిన పోలీసులు..

### లొంగిపోయాడన్న తండ్రి బండి సంజయ్

**రాత్రి 9 గంటలకు పోలీసు స్టేషన్ కు రాక.. రెండు గంటలపాటు విచారించిన పోలీసులు**

**అనంతరం మెజిస్ట్రేట్ ఎదుటకు భగీరథ్..14 రోజుల రిమాండ్ విధించిన జడ్జి**

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్.. పోక్సో కేసులో జైలుపాలయ్యాడు. ఈ కేసులో పోలీసులు నోటీసులు జారీ చేసినా విచారణకు హాజరుకాని భగీరథ్.. ఎట్టకేలకు శనివారం రాత్రి వారి చేతికి చిక్కాడు. నార్సింగి పరిధిలోని పోలీస్ అకాడమీ వద్ద భగీరథ్ ను రాత్రి 8:15 గంటలకు అరెస్టు చేశామని పోలీసులు ప్రకటించారు. అయితే తన కుమారుడిని తానే న్యాయవాదుల ద్వారా పోలీసులకు అప్పగించానని బండి సంజయ్ తెలిపారు. భగీరథ్ న్యాయవాదులు కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. కాగా, భగీరథ్ ను అదుపులోకి తీసుకున్న సైబరాబాద్ పోలీసులు వెంటనే పేట్ బషీరాబాద్ స్టేషన్ కు తరలించారు. అక్కడ ఈ కేసు పర్యవేక్షణాధికారి, డీసీపీ రితిరాజ్ ఆధ్వర్యంలో భగీరథ్ ను రెండు గంటలపాటు విచారించారు. బాధితురాలు, ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదులోని అంశాల ఆధారంగా భగీరథ్ ను పోలీసులు ప్రశ్నించినట్టు సమాచారం.


2లో

- మిగతా 2వ పేజీలో


## పవన్ టార్గెట్ వైసిపి!

**విజయ్ గెలుపుతో ఏపీలో సంబరాలు**

**ఊర్లో పెళ్లికి కుక్కల హడావిడి అంటూ డిప్యూటీ సీఎం హాట్ కామెంట్స్**

**పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం**



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** ఏపీలో పొత్తులు ఉంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నష్టం. రాష్ట్ర అభివృద్ధి కోసం మరో 15 సంవత్సరాలు పొత్తు దిశగా అడుగులు వేస్తామంటున్నారు చంద్రబాబు, పవన్ కళ్యాణ్. తమ పార్టీల శ్రేణులకు గట్టిగానే పిలుపునిస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాదు..


- మిగతా 2,3వ పేజీలో


## జగన్ హైదరాబాద్ షిఫ్ట్!

**బెంగళూరు నుంచి మకాం మార్పు**

**లోటస్ ఫండ్ నుంచి కార్యకలాపాలు**



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన బెంగళూరు నుంచి హైదరాబాద్కు షిఫ్ట్ కావాలని భావిస్తున్నారు. హైదరాబాదులోని లోటస్ ఫండ్ లో

## క్యాబినెట్ విస్తరణ!

**జూన్ రెండులోగా చేర్పులు,మార్పులు**

**రాములమ్మ తో పాటు రాజగోపాల్ రెడ్డికి ఛాన్స్**

**జాబితాలతో ఢిల్లీకి సీఎం రేవంత్**

తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందా? జూన్ రెండు లోగా మంత్రివర్గ విస్తరణ ఖాయమా? ఈ మేరకు సీఎం రేవంత్ సంకేతాలు ఇచ్చారా? మంత్రివర్గ విస్తరణ పై చర్చించేందుకు ఈరోజు ఢిల్లీ వెళుతున్నారా? పొలిటికల్ వర్గాల్లో దీనిపైనే చర్చ నడుస్తోంది.





**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** కేరళలో కాంగ్రెస్ ప్రభుత్వ కూర్పు కొలిక్కి రావడంతో.. తెలంగాణ మంత్రివర్గ విస్తరణ పై హై కమాండ్ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దానిపై చర్చించేందుకే ఈరోజు సీఎం రేవంత్ ఢిల్లీ బాట పట్టినట్లు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్ లో ప్రచారం జరుగుతోంది.

**ఆశావాహులు అధికం..**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు సమీపిస్తోంది. ఇటువంటి తరుణంలో


- మిగతా 2వ పేజీలో


## దేశంలో మూడో ఫ్రంట్!



**కెసిఆర్ సన్నాహాలు**

**కాంగ్రెస్ పార్టీ లేని బలమైన ప్రాంతీయ పార్టీలతో..**

**బిజెపి దూకుడుకు కళ్లెం వేయాలని గట్టి ప్రణాళికతో..**

కెసిఆర్ తృతీయ కూటమి వైపు అడుగులు వేస్తున్నారా? ఎన్డీఏ తో పాటు ఇండియా కూటమికి ప్రత్యామ్నాయ వేదిక తీసుకురానున్నరా? ఇదే మంచి సమయం అని భావిస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. దేశంలో ప్రస్తుతం బిజెపి హవా నడుస్తోంది.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఒక్కో రాష్ట్రం ఆ పార్టీకి చిక్కుతోంది. దీంతో బలమైన ప్రాంతీయ పార్టీల అధినేతలు ప్రతిపక్షానికి పరిమితం అవుతున్నారు. వారందరితో కలిసి ఇప్పుడు తృతీయ ఫ్రంట్ దిశగా కెసిఆర్ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

## 18న కేరళలో యూడిఎఫ్ ప్రభుత్వం

**నేడు గవర్నర్‌కు మంత్రుల జాబితా**

**కాబోయే సిఎం అభ్యర్థి సతీషన్ వెల్లడి**



**తిరువనంతపురం,(క్రైమ్ మిర్రర్):** కేరళంలో యూడీఎఫ్ ప్రభుత్వం 18న కొలువు తీరనుంది. మంత్రివర్గం ఏర్పాటుపై భాగస్వామ్య పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని, ఈనెల 17వ తేదీ ఆదివారంనాడు మంత్రుల జాబితాను గవర్నర్‌కు అందజేస్తామని ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టనున్నట్టు వీడీ సతీశన్ తెలిపారు. మే 18న తనతో పాటు మంత్రులంతా ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు.


- మిగతా 3వ పేజీలో


## కీలక శాఖలన్నీ విజయ్ వద్దే!

**తమిళనాడులో మంత్రులకు శాఖల కేటాయింపు**

**టీవీకేకు బాగా పనిచేసిన వారికి మంచి శాఖలు**




2లో


**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. తన మంత్రివర్గానికి శాఖలు కాటాయించారు. అయితే కీలకమైన శాఖలను విజయ్ తన వద్ద ఉంచుకున్నారు. మిగతా వాటిని మాత్రం పార్టీ నేతలతో పాటు మిత్రపక్షాలకు కేటాయింపులు చేశారు.



## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు!

**కే.కేశవరావు నేతృత్వంలో ఆరుగురు సభ్యులతో కమిటీ**

**మాట నిలబెట్టుకున్న రేవంత్ సర్కార్**


2లో


## నెదర్లాండ్స్ పర్యనటలో ప్రధాని మోడీ

**మోడీకి ప్రవాసభారతీయులు ఘన స్వాగతం**

**సెమీ కండక్టర్ల విషయలంఓ భారత్ దూసుకెళ్తోందని వెల్లడి**

**యూనికార్న్ సంస్థలు వందకు చేరాయని ప్రకటన**

**మన సంస్కృతీసంప్రదాయాలు చిరస్మరణీయమని కితాబు**

న్యూఢిల్లీ,మే16: సెమీకండక్టర్ల విషయంలో భారత్ కీలక ముందడుగు వేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం



# దేశంలో మూడో ఫ్రంట్!

(మొదటి పేజీ తరువాయి)

ఇండియా కూటమికి నో ఛాన్స్..: జాతీయస్థాయిలో ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా ఇండియా కూటమి ఉంది. కానీ అనుకున్న స్థాయిలో రాణించలేకపోతోంది. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ నీడలో పనిచేసేందుకు బలమైన ప్రాంతీయ పార్టీలు ముందుకు రావడం లేదు. దానికి కారణం ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రత్యర్థిగా ఉండడమే. ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్ నాయకత్వానికి ఇష్టపడని చాలా ప్రాంతీయ పార్టీలు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తూ వస్తున్నాయి. అదే సమయంలో బిజెపి హవా పెరుగుతోంది. బిజెపి దూకుడుకు కళ్లెం వేసే విధంగా.. కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయ వేదికగా ఉండే కూటమి కోసం ఈ బలమైన ప్రాంతీయ పార్టీలు ఎదురుచూస్తున్నాయి. వారందరినీ ఇప్పుడు ఏకతాటి పైకి తెచ్చే పనిలో ఉన్నారు కెసిఆర్.

**ఆ నేతలంతా ఏకతాటిపైకి..:** దేశంలో గత కొన్నేళ్ల పరిణామాలు చూస్తే చాలా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు కుప్పకూలిపోయాయి. బిజెపి బాధిత పార్టీలుగా మిగిలిపోయాయి. అరవింద్ కేజ్రీవాల్, ఉద్ధవ్ ఠాక్రె, మమతా బెనర్జీ, స్టాలిన్, జగన్మోహన్ రెడ్డి, కెసిఆర్, శరద్ పవర్, అఖిలేష్ యాదవ్, బీహార్ లాలు ప్రసాద్ యాదవ్ కుటుంబ సభ్యులు.. ఇలా వీరందరినీ ఏకతాటిపైకి తెస్తే మూడో ఫ్రంట్ ఖాయమని కేసీఆర్ అంచనా వేస్తున్నారు. గతంలో కూడా కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు మూడో ఫ్రంట్ కోసం ప్రయత్నాలు చేశారు. కానీ అప్పట్లో ఉన్న పరిస్థితులు వేరు. ఇప్పుడు కచ్చితంగా కెసిఆర్ పావులు కలిపితే కచ్చితంగా మూడో ఫ్రంట్ వర్కౌట్ అయ్యే అవకాశం ఉంది. బిజెపికి వ్యతిరేకంగా, కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఈ ఫ్రంట్ కు బలమైన ప్రాంతీయ పార్టీలన్నీ మద్దతు తెలిపే అవకాశం ఉంది. మరి కెసిఆర్ ప్రయత్నాలు ఎంతవరకు వర్క్ అవుట్ అవుతాయో చూడాలి.

# పవన్ టార్గెట్ వైసిపి!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రయోజనాల కోసం పొత్తు కొనసాగిస్తామని తేల్చి చెబుతున్నారు. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నిద్ర పట్టని పరిస్థితి. అందుకే ఆ రెండు పార్టీల మధ్య చిచ్చు పెట్టేందుకు చేయని ప్రయత్నం లేదు. మొన్నటికి మొన్న తమిళనాడులో విజయ్ గెలుపుతో.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను టార్గెట్ చేసుకుంది. ఒంటరి పోరాటం అన్న అంశంపై సోషల్ మీడియా వేదికగా పవన్ కళ్యాణ్ పై ట్రోల్ చేసింది. అప్పటికే అనారోగ్యంతో ఉన్నారు పవన్ కళ్యాణ్. కానీ జనసేన విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన పవన్ కళ్యాణ్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఇచ్చి పడేశారు. జన సైనికులకు బలమైన దిశా నిర్దేశం చేశారు. తమిళనాడు విజయ్ పార్టీపై కూడా పవన్ ఆసక్తికరంగా స్పందించారు. ఊర్లో పెళ్లికి కుక్కల హడావిడి అన్నట్లు కొందరి తీరు ఉందని ఎద్దేవా చేశారు.

## కాపు కుల ప్రస్తావన తెస్తూ..

అంబటి రాంబాబు అరెస్టు సమయంలో కాపు పేరు చెప్పి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేసింది. ఏకంగా వంగవీటి రంగా సరసన అంబటి రాంబాబును చేర్చింది. దీనిపై పవన్ విరుచుకుపడ్డారు. రంగా ఆపదలో ఉన్నప్పుడు రక్షించుకోలేని వారు.. నేడు ఆయన చనిపోయిన తర్వాత ఆయన పేరుతో కథలు చెబుతున్నారని గాలి తీసేశారు. ఇతరుల ట్రాప్ లో పడి మనం కూడా అలానే అరవాల్సిన అవసరం లేదని.... మన సిద్ధాంతాలతోనే వారికి గట్టి సమాధానం చెప్పాలని జన సైనికులకు దిశా నిర్దేశం చేశారు పవన్ కళ్యాణ్. మనల్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎక్కడ బలహీన పరచాలని చూస్తోందో.. దానినే ఒక పాయింట్ గా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

తమిళనాడులో రాజకీయ పరిస్థితులు... ఏపీలో రాజకీయ పరిస్థితులు వేరని.. తాను ఒంటరిగా పోటీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 11 సీట్లు వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా అంటూ ఒక్క మాటతో తేల్చేశారు.

**పక్కా పొలిటికల్ క్లారిటీతో..**

పవన్ కళ్యాణ్ ఇప్పుడు పక్కా పొలిటికల్ క్లారిటీతో కనిపిస్తున్నారు. గతంలో మాదిరిగా ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోవడం లేదు. ముఖ్యంగా భావోద్వేగ నేత అనే ముద్రను చెరిపేశారు. రాజకీయ పరిస్థితులకు తగ్గట్టు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఒంటరి పోరాటం పేరుతో రాజకీయ ప్రత్యర్థి ఆడుతున్న గేమ్ ను గుర్తించారు. దానిని పార్టీ శ్రేణులకు గుర్తు చేస్తూ వారి ట్రాప్ లో పడవద్దు అని సూచిస్తున్నారు. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తనను ఒక కులానికే పరిమితం చేయాలని చేస్తున్న కుట్రను కూడా గమనించారు. వాస్తవానికి పవన్ తనను తాను ఒక కులనేతగా ఎప్పుడూ చెప్పుకోలేదు. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం పవన్ ను ఆచక్రంలోనే ఉంచాలని ప్రయత్నిస్తోంది. కాపుల కోసం ఏం చేసావని అడిగే వైసిపి నేతలకు సమానంగా.. తాను కేవలం ఒక వర్గం కోసమే కాకుండా.. మొత్తం దేశం కోసం, వ్యవస్థ కోసం పనిచేయడానికి వచ్చానని పవన్ స్పష్టం చేశారు. తనపై కాపు ముద్ర వేయాలన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎత్తుగడను చిత్తు చేశారు.

# చర్లపల్లి జైలుకు భగీరథ్

విచారణ అనంతరం నిందితుడికి వైద్య పరీక్షలు నిర్వహించి, అర్ధరాత్రి సమయంలో మేడ్చల్ జిల్లా మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ అన్ని అంశాలను పరిశీలించి భగీరథ్ కు 14 రోజులపాటు రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు అతణ్ని చర్లపల్లి జైలుకు తరలించారు.

**లొంగిపోతాడన్న ప్రచారంతో..**

వాస్తవానికి బండి భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోతున్నాడని శనివారం ఉదయం నుంచి ప్రచారం జరిగింది. దాంతో పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన వద్ద తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పోలీసులు ముందుగానే స్టేషన్ ఎదుట బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇతరులెవరూ పోలీస్ స్టేషన్లోకి రాకుండా సాయంత్రం 6:30 నుంచి గేట్లు మూసివేశారు. భగీరథ్ ను పోలీసులు మఫ్టీ వాహనంలో స్టేషన్ కు తీసుకువచ్చారు. అయితే కేసు నమోదైన దగ్గర్నుంచి భగీరథ్ ఎక్కడా కనిపించకపోవడంతో అతణ్ని పట్టుకునేందుకు శనివారం ఉదయం నుంచే పోలీసు బృందాలు రంగంలోకి దిగి ప్రత్యేక గాలింపు చేపట్టాయి. హైదరాబాద్, ఢిల్లీ, కరీంనగర్, పుణె, బెంగళూరులో భగీరథ్ కోసం ముమ్మరంగా గాలించాయి. కరీంనగర్, హైదరాబాద్‌లోని కేంద్ర



మంత్రి బండి సంజయ్ ఇంటికి, ఆయన సన్నిహిత బంధువుల ఇళ్లకు వెళ్లాయి. భగీరథ్ మిత్రుల ఇళ్లలోనూ పోలీసులు తనిఖీలు చేశారు. భగీరథ్‌పై లుకౌట్ నోటీసు సైతం జారీ చేశారు. అతడు విదేశాలకు పారిపోకుండా విమానాశ్రయాల ఇమిగ్రేషన విభాగాలను అప్రమత్తం చేశారు. మరోవైపు

**బాధితుల వాంగ్మూలం సేకరణ..**

పోక్సో కేసుకు సంబంధించి ఫిర్యాదుదారులైన బాలిక, ఆమె తల్లి వాంగ్మూలాలను పోలీసు అధికారులు శనివారం మేడ్చల్ కోర్టులో మెజిస్ట?ట్రట్ సమక్షంలో నమోదు చేయించారు. భగీరథ్‌తో పరిచయం దగ్గర్నుంచి అతడు లైంగికదాడికి పాల్పడి ఘటన దాకా వారు వివరించినట్లు తెలిసింది. దీంతోపాటు భగీరథ్‌తో కలిసి ఉన్న స్నేహితులను పోలీసు స్టేషనకు అధికారులు పిలిపించి విచారించారు.

# క్యాబినెట్ విస్తరణ!

(మొదటి పేజీ తరువాయి)

మంత్రివర్గ విస్తరణ చేపట్టాలన్న డిమాండ్ గతం నుంచి ఉంది. చాలా మంత్రి పదవులు ఖాళీగా కూడా ఉన్నాయి. ఒకరిద్దరి మంత్రి పదవులను తొలగించి కొత్త వారికి అవకాశం ఇస్తారన్న ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా రాములమ్మతో పాటు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఛాన్స్ ఉంటుందన్న ప్రచారం పొలిటికల్ వర్గాల్లో ఉంది. అయితే ఓ పదిమంది వరకు ఆశావహులు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. వారి జాబితాలతో సీఎం రేవంత్ ఢిల్లీలో అడుగుపెట్టారు. హై కమాండ్ పెద్దలతో చర్చించి ఒక నిర్ణయానికి రానున్నారు.

**కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అవుట్**

ఒకరిద్దరు మంత్రుల తొలగింపు ఉంటుందన్న ప్రచారం ఉంది. ఇప్పటికే మంత్రివర్గంలో కోమటిరెడ్డి వెంకట్రెడ్డి ఉన్నారు. ఒకవేళ రాజగోపాల్ రెడ్డికి అవకాశం ఇస్తే వెంకట్ రెడ్డిని పక్కన పెట్టనున్నారు. ఓ మహిళా మంత్రిపై కూడా అనేక రకాల వివాదాలు నడిచాయి. ఆపై తెలంగాణ పిసిసి ప్రెసిడెంట్ మహేష్ గౌడ్ ను సైతం క్యాబినెట్ లోకి తీసుకుంటారన్న ప్రచారం ఉంది. అదే జరిగితే మంత్రుల్లో ఉన్న ఒక బీసీ నేతకు కాంగ్రెస్ రాష్ట్ర పగ్గాలు అప్పగిస్తారు. ప్రముఖంగా పొన్నం ప్రభాకర్ పేరు వినిపిస్తోంది. అయితే ఎట్టి పరిస్థితుల్లో 2028 ఎన్నికల టీంను రంగంలోకి దించాలని చూస్తున్నారు రేవంత్ రెడ్డి. తన నాయకత్వాన్ని ఎదురు చెప్పే వారిని పక్కన పెట్టాలన్న ఆలోచనతో కూడా ఉన్నట్లు తెలుస్తోంది. కేరళలో కాంగ్రెస్ గెలుపుతో రేవంత్ రెడ్డి పరపతి హై కమాండ్ వద్ద అమాంతం పెరిగింది. మరోసారి తెలంగాణలో పట్టు నిలుపుకోవాలంటే.. రేవంత్ రెడ్డికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని హై కమాండ్ భావిస్తోంది. రేవంత్ మార్కు మంత్రివర్గ ఎంపిక ఉంటుందన్న ప్రచారం ఉంది. కానీ మరో రెండు వారాల్లో తెలంగాణ రాజకీయాల్లో సంచలనాలు నమోదు కానున్నాయి అన్నమాట.

# కీలక శాఖలన్నీ విజయ్ వద్దే!

ఇటీవల అసెంబ్లీలో బలపరీక్షలో నెగ్గిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారికి శాఖలు కేటాయించారు. అయితే మిత్రపక్షాలకు మాత్రం గౌరవప్రదమైన శాఖలను కేటాయించారు. కీలకమైన హోం శాఖ, జనరల్ అడ్మినిస్ట్రేషన్ బాధ్యతలతో పాటు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ అండ్ వాటర్ సప్లై, మహిళా, శిశు, వృద్ధుల, వికలాంగుల సంక్షేమ శాఖలను విజయ్ స్వయంగా పర్యవేక్షించనున్నారు. పాలనలో ఎక్కడా లూప్ హోల్స్ లేకుండా.. నేరుగా తానే పర్యవేక్షించాలని పట్టుదలతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

**సీనియర్ కు ఆర్థిక శాఖ..**

ప్రస్తుతం తమిళనాడులో ఉన్న కూటమి ప్రభుత్వం దృష్ట్యా శాఖల కేటాయింపు అనేది అంత సులువు కాదు. సీనియర్ నాయకుడు సెంగోట్టాయన్ కు అత్యంత కీలకమైన ఆర్థిక శాఖను అప్పగించారు. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న ఆయన చేతిలో ఖజానా బాధ్యతలు పెట్టడం ద్వారా.. ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో నడుస్తుందన్న సంకేతాన్ని విజయ్ పంపగలిగారు. మరోవైపు టీవీ కే పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలోనూ.. వ్యూహరచనలోనూ కీలక పాత్ర పోషించిన అదవ్ అర్జున్ కు పబ్లిక్ వర్క్స్, క్రీడా శాఖల బాధ్యతలు దక్కాయి. అలాగే సోషల్ మీడియాతో పాటు ఐటీ వింగ్ బాధ్యతలు చూసి.. విజయ్కు అత్యంత నమ్మకస్తుడు అయిన నిర్మల్ కుమార్ కు విద్యుత్, న్యాయశాఖ వంటి కీలక శాఖలను అప్పగించడం విశేషం.

**పక్కా పొలిటికల్ వ్యూహం..**

అయితే విజయ్ టీం ఎలా ఉండబోతుంది అనే చర్చ తమిళనాడులో ఉంది. ఎందుకంటే అక్కడ బలమైన ప్రతిపక్షం డిఎంకె ఉంది. దశాబ్దాల అనుభవం ఆ పార్టీ సొంతం. క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి క్యాడర్ కూడా ఉంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతుంది కూడా. అందుకే ప్రభుత్వంలో శాఖల పరంగా ఎటువంటి లోపాలు బయటపడకుండా జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. అందుకే విజయ్ చాలా రకాలుగా జాగ్రత్తలు పడ్డారు. చదువుకున్న వారికి, నిపుణులకు మంత్రివర్గంలో ప్రాధాన్యమిచ్చారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తూ కీర్తనకు అత్యంత కీలకమైన పారిశ్రామిక శాఖను కేటాయించారు. త్వరలో విజయ్ తన మంత్రివర్గ విస్తరణ కూడా చేపడతారు. కాంగ్రెస్ తో పాటు అన్న డీఎంకే రెబల్ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు ఇవ్వనున్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు!

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు సంబంధించి దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. ఉద్యమకారులను అధికారికంగా గుర్తించి.. వారి త్యాగాలకు తగిన గౌరవం కల్పించేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తాము అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి గౌరవిస్తామని రేవంత్ రెడ్డి ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఇప్పుడు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు చర్యలు ప్రారంభించారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి మేలు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై తెలంగాణ ఉద్యమకారుల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

**పట్టించుకోని కెసిఆర్ సర్కార్..**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతోమంది ప్రాణాలను త్యాగం చేశారు. ఉద్యమ నేపథ్యంలో ఆవిర్భవించిన టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. పదేళ్లపాటు రాష్ట్రంలో అధికారంలో ఉంది. కానీ ఉద్యమకారులను గుర్తించడంలో విఫలమయింది అనే ఆరోపణలు ఎదుర్కొంది. అందుకే రేవంత్ ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ఇప్పుడు ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించారు. రాజకీయంగా దగ్గరగా ఉన్నవారికి గుర్తింపు దక్కిందన్న విమర్శలు ఉన్న సమయంలో.. క్షేత్రస్థాయిలో ప్రతి ఉద్యమకారుడుని గౌరవించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా సీనియర్ నేత కే కేశవరావు చైర్మన్గా.. ఆరుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీని నియమించింది. ఈ కమిటీలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్ వంటి ఉద్యమ మూలాలు ఉన్న నేతలకు చోటు కల్పించారు.

**బంగారు తెలంగాణతో పక్కకు..**

తొలుత ఉద్యమ తెలంగాణ నినాదంతో అధికారాన్ని దక్కించుకుంది తెలంగాణ రాష్ట్ర సమితి. తరువాత బంగారు తెలంగాణ అన్న నినాదంతో ముందుకు సాగిన కేసీఆర్ సర్కార్.. ఉద్యమకారులను విస్మరించిందని ఆరోపణలు ఉన్నాయి. అసలు ఉద్యమంతో సంబంధం లేని వారికి పదవులు ఇచ్చి.. కేసులతో పాటు దెబ్బలు తిన్నవారికి గాలికి వదిలేసారన్న అసంతృప్తి ఉద్యమ శ్రేణుల్లో బలంగా ఉంది. కవిత సైతం ఒక సందర్భంలో ఉద్యమకారులకు సరైన గుర్తింపు ఇవ్వలేకపోయామని క్షమాపణలు కూడా చెప్పారు. అందుకే రేవంత్ సర్కార్ ఈ తప్పులను సరిదిద్ది.. నిజమైన ఉద్యమకారులను వెలికి తీసే బాధ్యతను ఆ కమిటీకి అప్పగించింది.

**ఉద్యమ నేపథ్యం ఉన్న నేతలతో..**

ఉద్యమ నేపథ్యం ఉన్న నేతలతో ఈ కమిటీ నియమించడం నిజంగా శుభపరిణామం. ఇదేదో నామమాత్రపు కమిటీ కాదు. ఉద్యమ సమయంలో నమోదైన కేసులు, జైలు శిక్షలు, చురుగ్గా పాల్గొన్న సంఘటనల ఆధారంగా అర్హులను ఎంపిక చేయనుంది. ఎవరెవరు తెలంగాణ ఉద్యమకారులు అనే అంశంపై ఒక సమగ్ర జాబితాను సిద్ధరం చేయడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. కేవలం గుర్తింపు కార్డులు మాత్రమే ఇవ్వడమే కాదు.. ప్రభుత్వ పరంగా ఉద్యమకారులకు కల్పించాల్సిన గౌరవ మర్యాదలు, ఇతర సౌకర్యాలపై కూడా ఈ కమిటీ సిఫార్సులు చేయనుంది. పెన్షన్లు, బస్సు పాసులు, వైద్య సదుపాయాలు వంటి వాటిని ఉద్యమకారులకు కల్పించే అవకాశం ఉంది.

# నెదర్లాండ్స్ పర్యటనలో ప్రధాని మోదీ

నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమీకండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రధానికి ఘనస్వాగతం లభించింది. ప్రవాస భారతీయులతో కరచాలనం, మాటామంతీ నిర్వహించారు. నెదర్లాండ్స్ నాయకత్వంతో ఎప్పుడు మాట్లాడినా ప్రవాస భారతీయులను ఎంతో ప్రశంసించేవారని ప్రధాని గుర్తు చేసుకున్నారు. హేగ్ నగరం భారతీయ స్నేహానికి సజీవ చిహ్నంగా మారిందన్నారు. కాలం మారినా.. భారతీయ సంస్కృతి మారలేదని కొనియాడారు. ఈ సందర్భంగా ఈయూ దేశాలనుద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. నెలకు 20 బిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ చెల్లింపులు జరుగుతున్నాయి. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవి. ఇప్పుడు 100కిపైగా ఉన్నాయి. భారత్‌లో సెమీ కండక్టర్ ప్లాంట్ల పనులు జరుగుతున్నాయి. మేడిన్ ఇండియా చిప్‌లు తయారవుతున్నాయి. ఏఐ సమ్మిట్, జీ20 సమావేశాలను విజయవంతంగా నిర్వహించగలిగాం. భారత్‌లో 90 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో 64 కోట్ల మంది ఓటు వేశారు. ఈయూ దేశాల జనాభా మొత్తం కలిపినా 64 కోట్ల మంది కూడా లేరని మోదీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్‌లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది. భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నంగా మారిందని అనిపిస్తోంది. నేను నెదర్లాండ్స్ నాయకత్వంతో మాట్లాడిన ప్రతిసారీ వారు ప్రవాస భారతీయులను ప్రశంసిస్తూనే ఉంటారు.

నెదర్లాండ్స్ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు మీరు చేసిన సేవకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. మీ పూర్వీకులు ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలను వదిలేశారు. కానీ కొన్ని విషయాలు ఎల్లప్పుడూ వారితోనే ఉండిపోయాయి. భారతదేశ మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు, భక్తి గీతాల రాగాలు, పూర్వీకులు అందించిన విలువలు వారితోనే ఉన్నాయి. కాలక్రమేణా ఎన్నో సంస్కృతులు కనుమరుగయ్యా యనే వాస్తవానికి మానవ చరిత్రే సాక్ష్యం. కానీ భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ మన ప్రజల హృదయాల్లో బలంగా ఉంది. తరాలు మారాయి, దేశాలు మారాయి, పరిసరాలు మారాయి, కానీ కుటుంబ విలువలు, మనం ఒక సమూహానికి చెందినవారమనే భావన ఎన్నడూ మారలేదు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి.

## క్రైమ్ మిర్రర్ కథనానికి స్పందన

# మర్రిగూడ ఎస్ఐ కృష్ణారెడ్డిపై ఉన్నతాధికారుల వేటు!

### కొత్త ఎస్ఐగా మిర్యాలగూడ టూ టౌన్ నుండి రాంబాబు నియామకం.

### ఉన్నతాధికారుల ఉత్తర్వుల ప్రకారం త్వరలోనే బాధ్యతల స్వీకరణ




**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్ ప్రతినిధి):**

**మర్రిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గత కొంతకాలంగా సాగుతున్న ఖాకీ అరాచకాలు, అవినీతి అక్రమాలు, శాంతిభద్రతల క్షీణతపై 'క్రైమ్ మిర్రర్' పత్రిక నిష్పక్షపాతంగా, సాక్ష్యాధారాలతో ప్రచురించిన వరుస కథనాలకు ఉన్నతాధికారుల నుండి స్పందన లభించింది.**

ప్రజా సమస్యలను గాలికొదిలేసి, బాధితులపైనే అక్రమ కేసులు బనాయిస్తూ, పోలీస్ స్టేషన్‌ను అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) కృష్ణారెడ్డిపై ఉన్నతాధికారులు వేటు వేశారు. ఆయనను తక్షణమే ఆ బాధ్యతల నుండి తొలగిస్తూ, ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి సమర్థుడైన అధికారిగా పేరుపొందిన ఎస్ఐ రాంబాబును మర్రిగూడకు బదిలీ చేస్తూ, జిల్లా పోలీస్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ఉన్నతాధికారుల ఉత్తర్వుల ప్రకారం ఎస్ఐ రాంబాబు త్వరలోనే ఇక్కడ బాధ్యతలు స్వీకరించనున్నారు. మర్రిగూడ మండల కేంద్రంగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణా, మట్టి మాఫియా, పేకాట శిబిరాల నిర్వాహకుల నుండి పెద్ద ఎత్తున మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఎస్ఐ కృష్ణారెడ్డిపై బలంగా వినిపించాయి. లెంకలపల్లి పేకాట కేసులో నిందితులకు విముక్తి కల్పించేందుకు ఒక మాజీ ప్రజాప్రతినిధి ఖాతా ద్వారా యాభై వేల రూపాయల నగదు బదిలీ జరిగిందని, ఆ మొత్తాన్ని ఒక బీజేపీ లీడర్ ఖాతా నుండి మార్చుకున్నారనే సంచలన నిజాన్ని సైతం 'క్రైమ్ మిర్రర్' వెలుగులోకి తెచ్చింది. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, వారిని మానసికంగా వేధిస్తూ, స్థానిక హోటళ్లలో తాము తిన్న ఫుడ్ బిల్లులను కూడా బాధితుల చేత కట్టించే స్థాయికి ఇక్కడి పోలీస్ వ్యవస్థ దిగజారిందనే వాస్తవాలను క్రైమ్ మిర్రర్ ఆధారాలతో సహా నిలదీసింది.

వెంకేపల్లి తండాకు చెందిన ఒక వ్యక్తి తన కుమారుడిని సాక్షిగా పెట్టుకుని, సెల్ఫీ కన్నీటి పర్యంతమవుతూ, ఆత్మహత్య చేసుకున్న హృదయవిదారక ఘటనపై ప్రాథమిక దర్యాప్తును పక్కనబెట్టి, బాధితుల పక్షాన నిలిచిన 15 మంది అమాయక గిరిజన యువకులపై, అక్రమ కేసులు నమోదు చేయడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అలాగే భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి జరుపుకున్న యువకులపై డీజే నెపంతో కేసులు పెట్టడం, లెంకలపల్లిలో జరిగిన ఘోరాలపై నిరసన తెలిపిన సామాన్య ప్రజలపై కక్షసాధింపు చర్యలకు దిగడం వంటి సంఘటనలను 'క్రైమ్ మిర్రర్' ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తెచ్చింది.

- ఈ అరాచక పాలనపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. ప్రజాస్వామ్యంలో బాధితులను వేధించే అధికారులకు తావులేదని, సదరు అధికారిని తక్షణమే విధుల నుండి తొలగించాలని జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి డిమాండ్ చేశారని తెలుస్తుంది. క్రైమ్ మిర్రర్ రాసిన వరుస కథనాలు, ప్రజా ప్రతినిధుల ఒత్తిడి, ప్రజల నుండి వ్యక్తమైన తీవ్ర నిరసనలతో స్పందించిన ఉన్నతాధికారులు ఎస్ఐ కృష్ణారెడ్డిపై, శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ బదిలీ వేటు వేశారు. ?సరికొత్త ఆశలతో మర్రిగూడ ప్రజలు..

మిర్యాలగూడ టూ టౌన్ నుండి బదిలీపై వస్తున్న నూతన ఎస్ఐ రాంబాబు ఆధ్వర్యంలోనైనా, మర్రిగూడలో శాంతి భద్రతలు తిరిగి అదుపులోకి వస్తాయని, అక్రమ దందాలకు, మాఫియాలకు అడ్డుకట్ట పడుతుందని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యుడికి రక్షణ కవచంగా నిలవాల్సిన పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో పోయిన నమ్మకాన్ని కొత్త ఎస్ఐ పునరుద్ధరిస్తారని ఆశిస్తున్నారు. ?ప్రజల పక్షాన నిలబడి, అన్యాయాలను ఎండగడుతూ 'క్రైమ్ మిర్రర్' ప్రచురించిన సత్య నిరూపణ కథనాలే ఈ మార్పుకు కారణమని, పత్రికా స్వేచ్ఛకు, నిజాయితీ గల జర్నలిజానికి దక్కిన విజయమిదని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

# 18న కేరళలో యూడిఎఫ్ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ (ఐయూఎంఎల్) నేతలతో శనివారంనాడు సమావేశానంతరం మీడియాతో సతీశన్ మాట్లాడుతూ, రాజకీయ ప్రత్యర్థులు ఎన్ని విమర్శలుచేసినా సెక్యులర్ విధానాన్ని కొనసాగించేందుకు తాము కట్టుబడి ఉన్నట్టు సతీశన్ చెప్పారు. 'కేరళంలో కొన్ని శక్తులు విద్వేష ప్రచారం సాగిస్తున్నాయి.కానీ ముస్లిం లీగ్, వారి నేత పనక్కాడ్ సైయిద్ సాదిఖ్ అలి బలమైన సెక్యులర్ విధానాలకు కట్టుబడి ఉన్నారు. యూడీఎఫ్ కూడా సెక్యులర్ విధానానికి కట్టుబడి ఉంది. ఈ విధానాన్ని కొనసాగిస్తాం' అని వివరించారు. ఎన్నికల ప్రచారంలో ఐయూఎంఎల్‌తో యూడీఎఫ్ పొత్తును బీజేపీ, సీపీఎం లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేశాయని, కానీ ప్రజలు ఆ ఆరోపణలను తిప్పికొట్టి 102 సీట్లలో తమను గెలిపించారని సతీశన్ చెప్పారు. కాగా, దీనికి ముందు కాంగ్రెస్ సీనియర్ నేత రమేష్ చెన్నితాల నివాసానికి వెళ్లి సతీశన్ కలుసుకున్నారు. మంత్రివర్గం కూర్పు, శాఖలపై ఆయనతో చర్చించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్‌పై యూడీఎఫ్ విజయం సాధించింది. 140 స్థానాల్ల 102 సీట్లు గెలుచుకుంది. 2021 నుంచి విపక్ష నేతగా సతీశన్ వ్యవహరిస్తూ ఎల్‌డీఎఫ్‌ను సమర్ధవంతంగా ఎదుర్కోవడంతో ఆయనను సీఎం అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది.

# జగన్ హైదరాబాద్ షిఫ్ట్!

(మొదటి పేజీ తరువాయి)

నివాసం ఏర్పాటు చేసుకోవాలని చూస్తున్నారు. మారిన పరిస్థితుల నేపథ్యంలోనే ఆయన ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. గతంలో లోటస్ ఫండ్ నుంచి ఎక్కువగా రాకపోకలు సాగించేవారు. కానీ మొన్నటి ఎన్నికల తర్వాత ఆయన బెంగళూరు ప్యాలెస్ లో గడుపుతూ వచ్చారు. రాజకీయంగా విమర్శలు రావడంతో హైదరాబాదులోని లోటస్ ఫండ్ కు షిఫ్ట్ కావాలని చూస్తున్నారు.

**గతంలో అక్కడి నుంచే..**

ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేశారు వైయస్ రాజశేఖర్ రెడ్డి. ఆ సమయంలోనే హైదరాబాద్ లోటాస్ పండ్ లో భారీ నిర్మాణాలను ఏర్పాటు చేశారు. రెండు భవంతులను నిర్మించారు. ప్రస్తుతం అందులో ఒక భవనంలో పిసిసి చీఫ్ షర్మిల నివాసం ఉంటున్నారు. మరో నివాసం జగన్మోహన్ రెడ్డి ది. గతంలో ఈ ఇంటి నుంచే ఏపీకి రాకపోకలు సాగించేవారు జగన్మోహన్ రెడ్డి. 2012లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి ఆ ఇంటి నుంచి ఏపీకి రాకపోకలు సాగించారు. 2014 నుంచి 2019 మధ్య ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో సైతం అదే ఇంటి నుంచి వచ్చేవారు జగన్మోహన్ రెడ్డి. 2019లో అధికారంలోకి రావడంతో పూర్తిస్థాయి నివాసాన్ని తాడేపల్లికి మార్చేశారు.

**పార్టీ ఓడిపోయిన తర్వాత..**

మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడంతో జగన్మోహన్ రెడ్డి బెంగళూరుకు షిఫ్ట్ అయ్యారు. అక్కడ యెలహంక ప్యాలెస్ లో నివాసం ఉంటున్నారు. వారంలో నాలుగు రోజులపాటు అక్కడే ఉండి మరో మూడు రోజులు తాడేపల్లిలో కేంద్ర కార్యాలయానికి వస్తుండేవారు. అయితే ఈ క్రమంలో చాలా రకాల విమర్శలు వస్తున్నాయి. తాడేపల్లి టు బెంగళూరు షటిల్ సర్వీసులు అంటూ ప్రత్యర్థులు ఆరోపణలు చేయడం ప్రారంభించారు. అవి ప్రజల్లోకి బలంగా వెళ్తున్నాయి. అందుకే జగన్మోహన్ రెడ్డి పునరాలోచనలో పడ్డారు.

**ఆ కారణాలతోనే..**

ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చాలామంది హైదరాబాదులో ఉంటున్నారు. పైగా జగన్మోహన్ రెడ్డి రాజకీయ మిత్రులంతా హైదరాబాదులోనే ఉన్నారు. సెంటిమెంట్ పరంగా కూడా లోటస్ ఫండ్ కలిసి వచ్చింది. ఆపై సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హైదరాబాదులో తమ నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. వారు సైతం రాకపోకలు సాగిస్తున్నారు. అందుకే హైదరాబాద్ షిఫ్ట్ అయితే రాజకీయ విమర్శలు కూడా ఉండవని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారట. ఒకటి రెండు రోజుల్లో దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక ప్రకటన జారీ చేసే అవకాశం ఉంది.

## కూకట్ పల్లిలో కట్టు గాజుల షాప్ ను ప్రారంభించిన మాజీ శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి

**కూకట్ పల్లి, మే 16 (క్రైమ్ మిర్రర్) :** కట్టు గాజులకు ఎంతగానో పేరుగాంచిన వెంకటరమణ కట్టు గాజులు, జువెలర్స్ షోరూమ్ కూకట్ పల్లి కెపిహెచ్బి మెట్రో పిల్లర్ 750 దగ్గర వారి 5వ నూతన షో రూమ్ ను అట్టహాసంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి హాజరై స్టోర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బంగారు ప్రియుల కోసం ఎక్కడ కూడా దొరకని లేటెస్ట్ మోడల్స్ ను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొని వచ్చామని అన్నారు. 100 గ్రాముల్లో అయ్యే హారం వెంకటరమణ కట్టు గాజులు జువెలరీస్లో కేవలం 15 గ్రాములకే దొరుకుతుందని అన్నారు. 20 గ్రాముల్లో అయ్యే చైన్ నాలుగు గ్రాములు తయారు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. వినియోగదారులకు సులభంగా వారికి నచ్చిన డిజైన్లను కష్టమైజు చేసి ఇచ్చేలా తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఓపెనింగ్ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను సైతం ప్రకటించారు.



# నేడు ప్రపంచ రక్తపోటు దినోత్సవం

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ప్రపంచ రక్తపోటు దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు ప్రజలకు ముఖ్య సూచనలు తెలుపుతూ ప్రతి సంవత్సరం మే 17న "ప్రపంచ రక్తపోటు దినోత్సవం " ను నిర్వహించడం ద్వారా ప్రజల్లో అధిక రక్తపోటు (ఎఎజూవతీవఅంఱశీఅ) పై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యం ప్రస్తుతం మారుతున్న జీవనశైలి అధిక ఉప్పు వినియోగం శారీరక శ్రమ లేకపోవడం మానసిక ఒత్తిడి ధూమపానం మరియు మద్యపానం వంటి అలవాట్ల వలన రక్తపోటు సమస్య వేగంగా పెరుగుతోంది అని పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న అసంక్రమిత వ్యాధులైన బీపీ షుగర్ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు 30 సంవత్సరాల పైబడిన వారందరికీ పరీక్ష చేయగా సుమారు 8,00,835 మంది ప్రజలకు పరీక్షలు నిర్వహించగా వారిలో 79,588 మంది రక్తపోటు బాధితులను గుర్తించారు. వీరిలో 52,681 మంది ప్రభుత్వ వైద్య సంస్థల్లో చికిత్స పొందుతూ నియంత్రణలో ఉన్నారు. అదేవిధంగా మధుమేహం కేసులు కూడా గణనీయంగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు నిరంతరం తప్పకుండాఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని కోరడం జరిగింది. రక్తపోటు ను " సైలెంట్ కిల్లర్" అని పిలుస్తారు. ప్రారంభ దశలో స్పష్టమైన లక్షణాలు కనిపించకపోయినా నియంత్రణలో లేకపోతే గుండెపోటు బ్రెయిన్ సంబందిత మూత్రపిండ వ్యాధులు వంటి తీవ్రమైన సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది అని అందువల్ల ప్రతి వ్యక్తి కనీసం ఆరు నెలలకు ఒకసారి రక్తపోటు పరీక్ష చేయించుకోవడం చాలా అవసరం అని పేర్కొన్నారు.ప్రజలు రోజువారీ జీవితంలో తక్కువ ఉప్పు వినియోగించడం నూనె పదార్థాలు తగ్గించడం ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు నడక లేదా వ్యాయామం చేయడం ధూమపానం మరియు మద్యపానానికి దూరంగా ఉండడం మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించాలని సూచించారు.అలాగే జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆరోగ్య ఉపకేంద్రాలలో ఉచితంగా బి.పి. మరియు దయాబెటిస్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరడం జరిగింది.

## అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు:ఎస్సై కురుమూర్తి



ఇలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే అట్టి వాహనాన్ని సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని కల్వకుర్తి ఎస్సై కురుమూర్తి హెచ్చరించారు. శనివారం లింగసానిపల్లి, ఎల్లికట్ట గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 5 ట్రాక్టర్ల ను పట్టు కొని అట్టి ట్రాక్టర్ డ్రైవర్ లు.. వాటి యాజమానుల పైన కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.




**ప్లా**స్టిక్ రహిత సమాజం.. ప్లాస్టిక్ రహిత జిల్లా మన లక్ష్యం కావాలని, స్వచ్ఛతను ప్రజలందరూ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ జిల్లా ప్రజలందరికీ పిలుపునిచ్చారు.శనివారం రాయచోటి పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ నుండి ఆర్టీసీ బస్టాండ్ కూడలి వరకు నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో పారిశుద్ధ కార్మికులు, అంగన్వాడీ వర్కర్లు, ఉద్యోగులతో పాటు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా 'ప్లాస్టిక్ రహిత రాష్ట్రం' అనే ఇతివృత్తంతో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రతి నెలా మూడవ శనివారాన్ని 'స్వచ్ఛ ఆంధ్ర డే'గా ప్రకటించినట్లు తెలిపారు. మే 2026 నెలకు సంబంధించి 'ప్లాస్టిక్ రహిత రాష్ట్రం' అనే ఇతివృత్తంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా అరికట్టడం, ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం మరియు వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా మొత్తాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చాలనేది మన దీర్ఘకాలిక లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. వ్యర్థాల నుండి సంపదను సృష్టించే 'గ్రీన్ షాప్స్' ద్వారా ప్రజలు పొడి వ్యర్థాలను ఇచ్చి నిత్యావసర వస్తువులను పొందే వినూత్న విధానాన్ని ప్రోత్సహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వ్యాపారస్తులు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని అదేవిధంగా వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేయాలనుకున్నప్పుడు ఇంటి దగ్గర నుంచే బ్యాగులు తీసుకెళ్లాలన్నారు. దీంతో ప్లాస్టిక్ బ్యాగులు తిరిగి మన ఇంటికి రావని, మన పరిసరాలు అపరిశుభ్రం కావన్నారు. ప్లాస్టిక్ ను కాల్చి వేయడం వల్ల వాటి నుంచి వచ్చే రసాయనాలతో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని మనకు ఎటువంటి చెడు వ్యసనాలు లేనప్పటికీ మనం చేస్తున్నటువంటి పనులు అపరిశుభ్రత వాతావరణం వల్ల జబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ విషయాలను ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచుకొని ప్లాస్టిక్ నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. రాయచోటి ఆర్టీసీ బస్టాండ్ లోని పారిశుద్ధ్య పనులు, మరుగుదొడ్లు, బస్టాండ్ లోని వసతులను పరిశీలించారు. పారిశుద్ధ్య పనులు, ఇంకా మెరుగుపడాలని, వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ప్రయాణికులు బస్టాండ్ ఆవరణంలో నడిచే ప్రదేశంలో గ్రీన్ మ్యాట్ ను ఏర్పాటు చేయాలని, చల్లని త్రాగునీరు, మరిన్ని ఫ్యాన్లను ఏర్పాటు చేయాలని, డస్ట్ బిన్ లను సరైన ప్రదేశాలలో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు తగు సూచనలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం మానవహారం గా ఏర్పడి ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కొరకు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తాసిల్దార్ నరసింహ కుమార్,డిపిఓ రాధమ్మ,రాయచోటి మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి,ఆర్టీసీ డిఎం మహేశ్వర్ రెడ్డి,మున్సిపల్ సిబ్బంది, పబ్లిక్ హెల్త్ వర్కర్స్, ఉద్యోగులు తదితరులు

## ప్లాస్టిక్ ర రహితంగా అన్నమయ్య జిల్లా

పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర-- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం అమలుపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మదనపల్లిలోని కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పరిశుభ్రమైన పరిసరాలు, ఆరోగ్యవంతమైన జీవన విధానం, వ్యర్థాల సమర్థ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచి, అన్నమయ్య జిల్లాను స్వచ్ఛ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ప్రతి నెల మూడవ శనివారాన్ని లి"స్వచ్ఛ దివస్"లిగా నిర్వహిస్తూ గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్, ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్, సిటిజన్ ఫీడ్‌బ్యాక్, స్వచ్ఛ రథం, స్వచ్ఛ పథం, మ్యాజిక్ డ్రెయిన్స్ వంటి కార్యక్రమాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

పట్టణాల సుందరీకరణ, పాఠశాలల నుంచి వ్యర్థాల సేకరణ, ఎస్టీపీ/ఎన్ఎస్టీపీ నిర్వహణ, అవసరమైన స్థలాల సేకరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మదనపల్లి కమిషనర్ ప్రమీల, డీపీఓ రాధమ్మ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.జిల్లాలో వేగవంతమైన ప్రభుత్వ సేవలు, పారదర్శక సంక్షేమ పథకాల అమలుతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సేవల్లో వేగం నాణ్యత, పారదర్శకత పెంపొందించడంపై కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించడం, ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించడం, శాఖల పనితీరుపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి శాఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని, వాటిని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు తగిన సూచనలు జారీ చేశారు.పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై తదితర సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలకు సురక్షితమైన మరియు అందుబాటులో ఉన్న రవాణా సేవలు అందించడంతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

**మన దేశంలో ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్ళకు ఒకసారి వేసే ఓటు అయిపోయింది. ఓటు వేసిన మరుక్షణమే నాయకుడు అందలమెక్కుతాడు, ప్రజలు మరుగున పడిపోతారు. ఈ దేశంలో బీదలు బిచ్చమెత్తుకుంటే, నాయకులు బంగళాలు నిర్మించుకుంటున్నారు. రైతులు అప్పుల భారంతో ఆత్మహత్యలు చేసుకుంటే, నాయకులు విదేశాలలో విమానాల్లో హాయిగా తిరుగుతున్నారు. నిరుద్యోగులు వీధుల్లో అలమటిస్తే, నాయకుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలు సిద్ధంగా ఉంటున్నాయి.**

# నేడే సమరం.. నేడే శపథం!

ఇది ప్రజాస్వామ్యమా లేక రాచరికపు పోకడలతో కూడిన దోపిడీ వ్యవస్థా అని ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది.ఇది యాదృచ్ఛికం కాదు ఇది వ్యవస్థీకృతమైన, ప్రణాళికాబద్ధమైన దోపిడీ. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులు నాయకుల జేబుల్లోకి మళ్ళిపోతున్నాయి. పథకాల పేరుతో వేల కోట్ల రూపాయలు మాయమవుతున్నాయి. కాంట్రాక్టుల పేరుతో, లైసెన్సుల పేరుతో, అనుమతుల పేరుతో అవినీతి సర్పం ఈ దేశాన్ని బిగించి చుట్టేసింది. ఒక్క నాయకుడికి కోర్టు శిక్ష పడితే పది మంది అతని వెనక నిలబడతారు. ఒక్క కుంభకోణం వెలుగులోకి వస్తే, పదిహేను కుంభకోణాలు చీకట్లో దాగుంటాయి. సామాన్యుడు ఒక చిన్న తప్పు చేస్తే చట్టం వెంటనే చుట్టుముడుతుంది, కానీ వ్యవస్థను దోచుకునే తిమింగలాలు మాత్రం చట్టం కళ్ళు గప్పి స్వేచ్ఛగా తిరుగుతున్నాయి.

ప్రజలారా! మీ పిల్లలకు చదువు నేర్పించే నిధులు, మీరు తాగే నీళ్ళు శుద్ధి చేసే నిధులు, మీ రోగాలు నయం చేసే నిధులు అన్నీ ఈ రాజకీయ మొసళ్ళు మింగేస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమైపోతుంటే, కార్పొరేట్ విద్యాసంస్థలు కోట్లకు పడగలెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు లేక పేదలు ప్రాణాలు వదులుతుంటే, ప్రైవేటు ఆసుపత్రులు సామాన్యుడి రక్తాన్ని పిండుతున్నాయి. ఇదంతా ఎవరి పాపం? మనల్ని పరిపాలించే నాయకుల అసమర్థత, అవినీతి కాదా? ఇక సహించడం ఎంత కాలం? ఈ దోపిడీపై నేడే సమరం ప్రకటించాలి. ఓటు బ్యాంకు రాజకీయాలకు బలి కాకుండా, సచ్ఛీలంగా, దేశ భక్తితో పని చేసే ప్రజా సేవకులను ఎంచుకోవాలి. అవినీతిపరులను జవాబుదారీగా చేయాలి ఇది ప్రతి పౌరుడి కనీస బాధ్యత.మతం అంటే మనిషిని మనిషిగా చూడటం నేర్పించే జ్ఞానమని మన పూర్వీకులు నమ్మారు. కానీ నేడు ఈ దేశంలో మతాన్ని ఒక ప్రాణాంతక ఆయుధంగా మార్చిన వారున్నారు. దేవుని పేరుతో, ధర్మం పేరుతో, పుణ్యం పేరుతో ప్రజలను విభజించడం, ఒకరిపై ఒకరికి విద్వేషాగ్నిని రగిలించడం, నెత్తురు చిందించడం ఇది ఛాందసవాదుల వ్యాపారమైపోయింది. ప్రశాంతంగా ఉండే సమాజంలో మత విద్వేషాలనే విషబీజాలు నాటి, రాజకీయ పబ్బం గడుపుకునే దుర్మార్గుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది.

హిందూ-ముస్లిం,హిందూ-క్రైస్తవ,అగ్రవర్ణ-దళిత ఈ విభజనల మంటల్లో ఎంత మంది అమాయకులు బుగ్గిపాలయ్యారు? ఆ మంటల్లో వేసిన మాటలతో, ఆ మంటల వెలుగులో వేసిన రాళ్ళతో లాభపడింది ఎవరు? అవే ఛాందసవాదులు, అవే రాజకీయ నాయకులు! సామాన్య ప్రజలు మాత్రం రెండు పక్కల మోసపోయారు, ప్రాణాలు పోగొట్టుకున్నారు, ఇళ్ళు కోల్పోయారు. పండగలు, పబ్బాలు వస్తే ఆనందంగా గడపాల్సిన వీధులు, నేడు కర్ఫ్యూలతో, పోలీస్ పహారాలతో అట్టుడుకుతున్నాయి. ఒకరినొకరు నమ్ముకుని జీవించే పొరుగువారు సైతం నేడు అనుమానపు చూపులతో చూసుకునేలా ఈ వ్యవస్థను తయారుచేశారు.మతం ఒక వ్యక్తిగత విశ్వాసం. ఆధ్యాత్మిక ఒక లోపలి అనుభవం. కానీ మతాన్ని వీధుల్లోకి తీసుకువచ్చి రక్తం కారిస్తున్న వారికి ఏ మతమూ లేదు ఉన్నది కేవలం స్వార్థం మాత్రమే. నా మతం నన్ను ద్వేషించమని నేర్పలేదు అని గట్టిగా చెప్పే ధైర్యం ప్రతి పౌరుడికీ ఉండాలి. నిజమైన ఆధ్యాత్మికత ఐకమత్యంలో పుట్టుకొస్తుంది, విద్వేషంలో కాదు. మానవత్వమే అన్ని మతాల పరమార్థం అని గ్రహించినప్పుడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం సిద్ధిస్తుంది. ఛాందసవాదానికి వ్యతిరేకంగా నేడే గళం విప్పాలి మన తర్వాత తరాల కోసం మనం ఒక ప్రశాంతమైన సమాజాన్ని అందించాలి.బీదల కన్నీళ్ళతో కట్టిన నాయకుని బంగళా శాశ్వతం కాదు ప్రజల జాగృతి ముందు ఆ బంగళా పేకమేడే!ఒక గ్రహం మారితే జీవితం తారుమారవుతుందని నమ్ముతారు. ఒక పక్షి అరిచిందని ప్రయాణం మానేసుకుంటారు. దెయ్యం పట్టిందని అనారోగ్యంతో ఉన్న మనిషిని వైద్యుని దగ్గరకు తీసుకెళ్ళకుండా మాంత్రికుని ముందు పడేస్తారు. ఒక పురోహితుడు చెప్పాడని పసిపిల్లను బాల్యవివాహం చేసేస్తారు. ఇవి కట్టుకథలు కాదు ఈ దేశంలో ఈ నాటికీ నిత్యం జరుగుతున్న విషాద సంఘటనలు! సైన్స్ ఎంతో పురోగమిస్తున్నా, మనం సాంకేతికంగా ఎంతో ముందుకు వెళ్తున్నా, క్షుద్రపూజల పేరుతో నరబలులు ఇచ్చేంతటి అనాగరికత నేటికీ మన సమాజంలో వేళ్ళు ఊనుకుని ఉండటం అత్యంత విచారకరం.

మూఢ నమ్మకాల కారణంగా ప్రతి సంవత్సరం ఎంత మంది ప్రాణాలు కోల్పోతున్నారో? చదువుకోవలసిన



పిల్లలు తాంత్రికుల చేతుల్లో బలిపశువులు అవుతున్నారు. వైద్యం తీసుకోవలసిన రోగులు గుడి గుమ్మాల ముందు, బాబాల ఆశ్రమాల ముందు కూర్చొని మరణిస్తున్నారు. ఆస్తులు అమ్ముకొని మాయాజాలగాళ్ళకు, నకిలీ స్వామీజీలకు డబ్బులు కట్టిన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ముఖ్యంగా మహిళలు, నిరక్షరాస్యులు, పేదలు ఈ మూఢ నమ్మకాల వలలో ఎక్కువగా చిక్కుకుంటున్నారు. వారి అమాయకత్వాన్ని, భయాన్ని ఆసరాగా చేసుకుని కోట్లు సంపాదిస్తున్న మోసగాళ్లను చట్టం ముందు నిలబెట్టాలి.జ్ఞానం మనిషిని ముందుకు నడిపిస్తుంది. అజ్ఞానం వెనక్కు లాగుతుంది. మన పూర్వీకులు జ్యోతిష్కులు, వైద్యులు, గణితజ్ఞులు, శాస్త్రవేత్తలు వారు విజ్ఞానాన్ని పెంపొందించారు, మానవ జీవితాన్ని మెరుగు పరిచారు. కానీ నేడు కొంత మంది మనల్ని మళ్ళీ అంధకారంలోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ప్రతీ చిన్న విషయానికి దైవకృపనో, లేక గ్రహాల దోషాలనో అప్పగించి, మనిషి తన సొంత ప్రయత్నాన్ని, శ్రమను మరిచిపోతున్నాడు. శాస్త్రీయ దృక్పథంతో ప్రతి సమస్యను పరిశీలించడం, హేతుబద్ధంగా ఆలోచించడం ఇది ఈ నాటి అత్యవసర అవసరం. మూఢ నమ్మకాల అంధకారాన్ని విజ్ఞాన దీపంతో పారద్రోలాల్సిన సమయం ఇప్పుడే.ఆధునిక భారతదేశంలో మనం చంద్రమండలంపై అడుగు పెట్టగలమని కలలు కంటున్నాం. అంతరిక్షంలో ఉపగ్రహాలను పంపుతూ ప్రపంచ దేశాల సరసన నిలుస్తున్నాం. అదే సమయంలో ఈ దేశంలో ఒక యువకుడు గుర్రం ఎక్కినందుకు చంపబడ్డాడు. ఒక యువతి తన మనసు నచ్చిన వారిని పెళ్ళి చేసుకుందని కన్న కుటుంబమే ఆమె ప్రాణాలు తీసింది. ఒక దళిత కుటుంబం ఊరి బావిలో మంచి నీళ్ళు తాగినందుకు వెలివేయబడింది. ఇది 21వ శతాబ్దంలో భారతదేశం ఇది విద్యావంతులమని చెప్పుకునే మనకు సిగ్గు కలిగించే పచ్చి నిజం.కులం పేరు చెప్పి ఎన్ని అమాయక ప్రాణాలు పోతున్నాయో? ఎంత ప్రతిభ అణచివేయబడుతుందో? ఏ కులంలో పుట్టారు అని చూసి ఉద్యోగం, న్యాయం, గౌరవం నిర్ణయించే ఈ దేశంలో రాజ్యాంగం ఇచ్చిన సమానత్వం ఎక్కడ ఉంది? పుట్టుక ఆధారంగా మనిషిని అంటరానివాడని, అధమదని, తక్కువ జాతివాడని నిర్ణయించే ఆ వ్యవస్థ అది మానవత్వానికి అతి పెద్ద అవమానం. కుల గజ్జి తలకెక్కిన మనుషులు, తోటి మనిషిని కనీసం మనిషిగా కూడా గౌరవించలేకపోతున్నారు. ఈ కుల వివక్ష సమాజాన్ని లోపలి నుంచే తొలిచేస్తున్న చెదపురుగు వంటిది.కుల వ్యవస్థ అనేది మనిషే తయారు చేసిన జైలు. అందులో పుట్టింది నేరం కాదు అందులో ఉండడానికి అనుమతి ఇవ్వడం, దాన్ని ఇంకా కొనసాగించడం నేరం. బాబాసాహేబ్ అంబేద్కర్ పోరాడింది ఈ జైలు తలుపులు తెరవడానికే. జ్యోతిబా పూలే చదువు చెప్పింది ఈ సంకెళ్ళు తెంచడానికే. కందుకూరి వీరేశలింగం సంఘ సంస్కరణ చేసింది ఈ సమాజాన్ని శుభ్రపరచడానికే. పెరియార్, నారాయణ గురు వంటి మహానుభావులు తమ జీవితాలను ధారపోసింది ఈ వివక్ష లేని సమాజం కోసమే. వారి కల పూర్తి చేయడం మన తరం బాధ్యత. కులం కాదు, నైపుణ్యం మనిషి గుర్తింపుగా మారాలి. పుట్టుక కాదు, పని మనిషి గొప్పతనాన్ని నిర్ణయించాలి.ఇంత చెప్పాక ఒక్క ప్రశ్న మనం ఏం చేస్తాం? ఆవేశపడి, తర్వాత పక్కన పెడతామా? టీవీ ముందు కూర్చొని తిట్టుకొంటామా? సోషల్ మీడియాలో నాలుగు లైకులు, కామెంట్లు పెట్టి, మాటలు వదిలి నిద్రపోతామా? లేదా నేను, నువ్వు, మనందరమూ కలిసి ఈ కుళ్ళిపోయిన వ్యవస్థను మార్చడానికి నడుం కడతామా? కేవలం వేదికలపై ఉపన్యాసాలు ఇస్తే సమాజం మారదు. మార్పు మన ఇంటి నుంచే, మన నుంచే మొదలుకావాలి.గాంధీజీ ఒక్కడే బయలుదేరాడు వెంట మిలియన్ల నడిచారు. అంబేద్కర్ ఒంటరిగా పుస్తకాలు పట్టుకున్నాడు చివరికి కోట్ల మంది జీవితాల్లో వెలుగులు నింపుతూ రాజ్యాంగం రాశాడు. శ్రీశ్రీ ఒక కలం పట్టుకున్నాడు తెలుగు సాహిత్య యుగాలు మారాయి, విప్లవ భావాలు ప్రజల్లోకి చొచ్చుకెళ్లాయి. ఒక్క మనిషి మేల్కొంటే వందమంది మేల్కొంటారు ఇది చరిత్ర మనకు నేర్పిన అమూల్యమైన పాఠం. మనం కూడా ఆ ఒక్కరిగా ఎందుకు మారకూడదు? మన వంతు బాధ్యతగా సమాజ శ్రేయస్సు కోసం ఎందుకు నిలబడకూడదు?అవినీతి నాయకుడిని ఓటుతో ఇంటికి పంపించు. డబ్బుకు, మద్యానికి నీ ఓటును అమ్ముకోకు. మూఢ నమ్మకాన్ని హేతువుతో ఎదిరించు. శాస్త్రీయంగా ఆలోచించు. ఛాందసవాది చెప్పే విద్వేష మాటలకు చెవినివ్వకు. కులం పేరుతో ఎవరైనా విద్వేషం రగులిస్తే ఆ మంటకు ఆజ్యం పోయకు, బదులుగా ప్రేమాభిమానాలతో దాన్ని చల్లార్చు. ఇది నీ కోసం మాత్రమే కాదు నీ పిల్లల భవిష్యత్తు కోసం, ఈ దేశం కోసం, ఈ మట్టి కోసం, ఈ తరం కోసం! మన పూర్వీకులు అందించిన ఈ మహోన్నత దేశాన్ని, రాబోయే తరాలకు మరింత సురక్షితంగా, సుభిక్షంగా అందించాల్సిన గురుతర బాధ్యత మనపై ఉంది.మేల్కొనే సమయం వచ్చింది. సమరానికి నేడే ఆహ్వానం సమాజానికి నేడే శపథం! అశాంతి కాదు మేల్కొలుపు కావాలి. నిరాశ కాదు నిర్ణయం కావాలి. వినాశనం కాదు విముక్తి కావాలి. ఈ సమరం కత్తి పట్టి రక్తం చిందించే సమరం కాదు అక్షరం పట్టి జ్ఞానాన్ని పంచే సమరం. ఆవేశం కాదు ఆలోచనతో అడుగులు వేయాలి. అహంకారం కాదు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి. ఈ నాలుగు రుగ్మతలపై అవినీతిపై, ఛాందసత్వంపై, మూఢత్వంపై, కుల విభేదాలపై ఒక నిరంతర ప్రజా ఉద్యమం మొదలు కావాలి. ఆ ఉద్యమానికి మీరే నాయకులు, మీరే సైనికులు, మీరే రేపటి విజేతలు!



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**రాజన్న సిరిసిల్ల:** ధాన్యం సేకరణ ప్రక్రియలో నిమగ్నమైన అధికారులు అప్రమత్తంగా ఉండి క్షేత్ర స్థాయిలో కొనుగోళ్ళ ప్రక్రియ వేగవంతం అయ్యేలా పర్యవేక్షణ చేయాలని,ధాన్యం తరలింపు,ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీలో జాప్యం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం,వాహనాల ద్వారా ధాన్యం తరలింపు,హమాలీల సంఖ్య పెంచి అన్ లోడింగ్ చేయడం,ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ, రైతులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై శనివారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ఆర్డీఓలు,పౌర సరఫరాలు,వ్యవసాయ, సహకార శాఖ,గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా,మెప్మా, మార్కెటింగ్,మార్క్ ఫెడ్,కార్మిక శాఖ అధికారులు,అన్ని మండలాల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఏపీఎం లు, ప్యాక్స్ సెక్రటరీలతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు, గోదాములకు తరలించడంపై అధికారులు దృష్టి సారించి, క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల నుండి తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని,వాహనాలు సమకూర్చకపోతే సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో డిమాండ్ కు అనుగుణంగా వాహనాలు సమకూర్చాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లోడింగ్ కోసం, మిల్లులు, అపరల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల కొరత లేకుండా చూడాలని, హమాలీల సంఖ్యను డిమాండ్ కు అనుగుణంగా పెంచి, ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. హమాలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ముఖ్యంగా రైతులకు ఇబ్బందులు కలగకుండా రైతుల నుండి సేకరించిన ధాన్యానికి సంబంధించిన ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ జాప్యం చేయవద్దని ఆదేశించారు. ఏపీఎం లు ప్రత్యేకంగా దీనిపై దృష్టి సారించి తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద ఉన్న పరిస్థితులను పర్యవేక్షణ చేయడానికి కేటాయించిన రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని,క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
ఆదివారం 17-5-2026



# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పక్షికంగా నిర్వహించాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

## ప్రతి ఇంటికి బీఎల్‌వో చేరుకొని పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలి

## నిజమైన ఓటరు ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలి

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిష్పక్షికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమం మ్యాపింగ్ పురోగతిని సమీక్షించారు. ఖమ్మం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను సమన్వయం చేసుకుని మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఎస్ఐఆర్ షెడ్యూల్ ప్రకారం జూన్ 15 నుండి 24 వరకు సన్నాహక చర్యలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ కాలంలో బీఎల్ఓ లు, ఎన్నికల సిబ్బందికి ఎస్ఐఆర్‌పై పూర్తి స్థాయి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి బీఎల్ఓకు ఎస్ఐఆర్ నిబంధనలు, విధి విధానాలు ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హమైన ఓటరుని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా




సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు కొత్త క్లెయిమ్‌లు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై ఫీల్డ్ స్థాయిలో విచారణ నిర్వహించాలని ఎటువంటి ఫిర్యాదును నిర్లక్ష్యంచేయరాదని సూచించారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు క్లెయిమ్‌ల స్వీకరణ జరుగుతుందని సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ గత వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో మంచి పురోగతి సాధించామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన అన్ని సూచనలను అధికారులు పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ప్రజల వద్ద నివాస ధ్రువీకరణకు సంబంధించిన ధ్రువపత్రాలు లేని సందర్భాల్లో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వ్యవహరించాలని సూచించారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో స్థానిక పరిస్థితులపై పూర్తి అవగాహన, పట్టు ఉన్న సమర్థులైన బీఎల్‌వోలను నియమించాలని ఆదేశించారు. ఏ ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా అత్యంత జాగ్రత్తగా పనిచేయాలని తెలిపారు. అన్ని బీఎల్‌వోలకు పూర్తిస్థాయి శిక్షణ అందించాలని, క్షేత్రస్థాయిలో ప్రజలతో మాట్లాడే సమయంలో ఎవరూ నిర్లక్ష్యంగా లేదా అనవసర వ్యాఖ్యలు చేయరాదని స్పష్టం చేశారు.

ఏదైనా ఓటరు పేరు జాబితాలో లేకపోతే అందుకు గల కారణాన్ని స్పష్టంగా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం యొక్క ప్రధాన అజెండా అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా చూడటమేనని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రతి అభ్యంతరం క్లెయిమ్ దరఖాస్తును క్షేత్ర స్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బీఎల్‌వోలు, ఎన్నికల సిబ్బంది ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ శ్రీనివాస్ సంబంధిత జిల్లా అధికారులు ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ అన్సారి తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం ఆధ్వర్యంలో కేకే కమిటీ జీవో విడుదల పట్ల హర్షం

**శ్రీమతి సోనియా గాంధీ , సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం ఆధ్వర్యంలో కేకే కమిటీ జీవో విడుదల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం జీ.వో ఆర్డీ నంబర్ 679 ను జారీ చేసినందుకు, ఖమ్మం అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారులు కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు శ్రీమతి సోనియా గాంధీ కి మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె.వి కృష్ణారావు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి ఎదురుచూస్తున్న ఉద్యమకారుల చిరకాల కోరిక నెరవేరుతున్న సందర్భంగా ఉద్యమకారులంతా చాలా ఆనందంతో ఉన్నారు గాని కమిటీ యొక్క విధి విధానాలను స్పష్టంగా తెలియజేయాలని కాలయాపన చేయకుండా శ్రీకృష్ణ కమిటీ లాగా ఊరూ ఊరూ వాడ వాడ తిరిగి ఉద్యమకారులను నాయకులను నేరుగా కలిసి గుర్తింపు కార్డులను జారీ చేసి తుది నివేదికను తయారుచేసి తక్కువ టైంలో ప్రభుత్వానికి అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య గుంతేటి వీరభద్రం పగడాల నరేందర్ బచ్చుల పద్మాచారి షేక్ అబ్బాస్ బత్తిన మధుగౌడ్ లింగనబోయిన సతీష్ కూరపాటి సుశీల రవిచంద్ర చౌహాన్ బాలిన భాస్కర్ రెడ్డి దరిపల్లి వీరబాబు మోత్కూరి వేంకటేశ్వరా చారి భుక్య శ్రీనివాస్ నాయక్ దొడ్డ శ్రీనివాస్ రెడ్డి కోడిరెక్క ఉమాశంకర్ గాజుల రవి కుమార్ ఆసిఫ్ బురాన్ కోటేశ్ యాదవ్ రెడ్డబోయిన వరలక్ష్మి గ్లోరి కమలమ్మ ధనలక్మి స్వరూప కోసూరి వీరబాబు పగడాల నాగరాజు పగడాల శీను గాలి రాము ఇనుప శీను లంజేపల్లి బాబు నార్పొంగు వెంకట్ పరికపెల్లి ఎల్లయ్య ఎస్ కే యాకూబ్ సుందర్రావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన ధరలు తగ్గించాలంటూ సిపిఎం రాస్తారోకో



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) కేంద్ర ప్రభుత్వం పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని, బండి భగీరథ్ ని పొక్సో చట్టం క్రింద వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ నేడు సిపిఎం బాలాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో మీర్ పేట్ చౌరస్తాలో రోడ్డుపైన ప్లే కార్డులతో ప్రధాని మోదీ డౌన్ డౌన్ పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిరసన ధర్నా చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బాలాపూర్ మండల ఇంచార్జి గోరెంకల నర్సింహా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు దాసరి బాబు, సుంకోజీ యాదగిరి చారి, మీర్ పేట్ నాయకులు దాసరి నర్సింహా, వెల్లంకి లక్ష్మారెడ్డి, నీలం వెంకయ్య, బురాన్, జపాల జంగయ్య, కొండల్, వెంకటేష్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



**చౌటుప్పల్,మే 16, క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ మండలం,తూప్రాన్ పేట్ గ్రామ పరిధిలో ఈనెల 12వ తేదీ మంగళవారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ ఈనెల 15వ తేదీ శనివారం రాత్రి 8:30 గంటల సమయంలో మృతి చెందినట్లు సీఐ మన్మధకుమార్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 49 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం మృతదేహం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీ గదిలో భద్రపరచటం జరిగిందని ఇట్టి వ్యక్తి వివరాలు తెలిసిన వారు ఎవరైనా చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ లేదా ఎస్సై ఎస్. కృష్ణ మాల్ 8712662505 నెంబర్ కు సమాచారం అందించాలని కోరారు.

# పోలీసుల వినూత్న ప్రయోగం

## మూగ జీవాల కొమ్ములకు రేడియం స్టిక్కర్స్

## ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు




**క్రైమ్ మిర్రర్,హుజూర్ నగర్ (పాలకీడు) :** రోడ్డు ప్రమాదాల నివారణకు పశువుల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు అంటిస్తున్నట్లు పాలకీడు మండల ఎస్ఐ కోటేష్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాత్రి వేళల్లో ప్రమాదాలను అరికట్టేందుకు ఈ వినూత్న చర్యలు చేపట్టామని అన్నారు. పాలకీడు మండలం లో స్థానిక పోలీస్ స్టేషన్లో పరిధిలో మూగజీవుల కు మనుషులు రోడ్డు ప్రమాదం జరగకుండా ఉండడానికి సూర్యాపేట జిల్లా ఎస్పీ ఆదేశానుసారం మూగజీవాల కొమ్ములకు రేడియం స్టిక్కర్ అంటిచే కార్యక్రమం చేపట్టామని అన్నారు.వేసవికాలంలో మేతకోసం రైతులు పశువులను వదులుతారు రాత్రి వేళలో పశువుల రోడ్డు దాటుతుండగా ప్రమాదాలు జరిగి మనుషులు పశువులు చనిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఈ ప్రమాదాల అరికట్టటానికి పశువుల కొమ్ములకు రేడియం స్టిక్కర్ అంటించి ప్రమాదాల నివారణకు తమ వంతు బాధ్యతగా రైతులకు అవగాహన కలిగిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు

కంటెంట్ రైటర్లు కావలెను

సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595


# పంతంగి టోల్ ప్లాజా వద్ద భారీగా గంజాయి పట్టివేత

**పరారీలో ఇద్దరు నిందితులు, ఇద్దరు నిందితులు అదుపులోకి...**

**పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు...**

**చౌటుప్పల్ సీఐ జి.మన్మధకుమార్**



**చౌటుప్పల్,మే 16, క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం , పంతంగి టోల్ ప్లాజా వద్ద శనివారం రాచకొండ నార్కోటిక్స్, చౌటుప్పల్ పోలీసులు సంయుక్తంగా భారీగా గంజాయిని పట్టుకున్నారు.సీఐ జీ మన్మధకుమార్ తెలిపిన వివరాలు ప్రకారం... శనివారం పోలీసుల కన్వీన విశ్వసనీయ సమాచారం మేరకు రాచకొండ నార్కోటిక్స్ పోలీసులు, చౌటుప్పల్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో పంతంగి టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించగా టీఎస్ 07జి.ఎం 4617 నకిలీ నంబర్ ప్లేట్ గల మహీంద్రా ఎక్స్.యు.వి వాహనాన్ని అనుమానస్పదంగా ఆపి వాహనాన్ని తనిఖీ చేసే సమయంలో అందులో ఉన్న నలుగురు వ్యక్తుల్లో ఇద్దరు వ్యక్తులు అక్కడి నుండి పారిపోగా, మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సిఐ తెలిపారు. వాహనాన్ని తనిఖీ చేయగా సుమారు 437 కిలోల గంజాయి స్వాధీనం అయింది. ఇందులో 5 కిలోల చొప్పున 83 ప్యాకెట్లు మరియు 2 కిలోల చొప్పున 8 ప్యాకెట్లను గుర్తించినట్లు తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు 2 కోట్ల 18 లక్షల 75 వేల రూపాయలు ఉంటుందని వెల్లడించారు.పోలీసుల విచారణలో నిందితులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారని, రాజమండ్రి ప్రాంతంలో రాకేష్ అనే వ్యక్తి వద్ద నుండి గంజాయిని సేకరించి ఉత్తరప్రదేశ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు.అదుపులోకి తీసుకున్న నిందితుల వివరాలను వెల్లడించారు. సలీమ్ (34),లిషాడి గ్రామం, మీరట్ జిల్లా,ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. అమన్ (22 )లిషాడి గ్రామం, మీరట్ జిల్లా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించినట్లు తెలిపారు.ఈ కేసులో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అమీరుద్దీన్, ఫిరోజ్ లను ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భారీగా గంజాయి పట్టుకున్న పోలీసులను డి.ఎస్.పి పటోళ్ల మధుసూదన్ రెడ్డి అభినందించారు.

# ప్రతిపక్షాల ఆరోపణల నడుమ వేగవంతంగా సాగుతున్న వడ్ల కొనుగోలు ప్రక్రియ

## బార్‌దాన్ కొరతతో రైతుల ఆందోళన...కాంగ్రెస్ నాయకుల చొరవతో కొనుగోళ్లకు ఊతం

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలోని ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రంలో ప్రారంభ దశలో రైతులు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, ప్రస్తుతం కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ముఖ్యంగా బార్‌దాన్ (గన్నీ సంచులు) కొరత కారణంగా రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయగా, స్థానిక కాంగ్రెస్ నాయకులు చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయడంతో పరిస్థితి కొంత మెరుగుపడింది.కొనుగోలు కేంద్రానికి తమ ధాన్యం తీసుకొచ్చిన రైతులు రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, గన్నీ సంచులు లేక ధాన్యం నిల్వ ఉంచడంలో ఇబ్బందులు ఎదురయ్యాయని రైతులు వాపోతున్నారు. ఐకెపి సెంటర్ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కారణంగానే ఈ సమస్య



తలెత్తిందని రైతాంగం ఆరోపిస్తోంది. ఇక ప్రతిపక్ష పార్టీలు కొనుగోలు కేంద్రంలో అవ్యవస్థలు నెలకొన్నాయని విమర్శలు గుప్పిస్తున్న వేళ, స్థానిక కాంగ్రెస్ నాయకులు కేంద్రాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడి కొనుగోళ్లను వేగవంతం చేయించే దిశగా చర్యలు చేపట్టారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం తూకాలు, రవాణా ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. దీంతో గత కొన్ని రోజులుగా నిలిచిపోయిన కొనుగోళ్లు మళ్లీ వేగం పుంజుకున్నాయని రైతులు చెబుతున్నారు. ఇంకా గన్నీ సంచుల కొరత పూర్తిగా తీరకపోయినా, అధికారులు తాత్కాలిక చర్యలు తీసుకుంటూ ధాన్యం కొనుగోళ్లు కొనసాగిస్తున్నట్లు సమాచారం. రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల పట్ల మరింత చిత్తశుద్ధితో వ్యవహరించి, కొనుగోలు కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ముఖ్యంగా బార్‌దాన్ కొరత, తూకాల ఆలస్యం, రవాణా సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటే రైతులకు ఉపశమనం కలుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

# శనీశ్వరుడికి పూజలు చేసిన రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి



**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని గాన్సి ?మయాగూడాలోని శ్రీ శనీశ్వర భగవాన్ దేవాలయంలో శని త్రయోదశి అమావాస్య, శనీశ్వర జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు చేశారు. దేవాలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ శని బాధలు తొలగిపోయి ప్రజలందరూ సంతోషంగా ఉండాలని భగవంతుని కోరుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాల పై ఏర్పాటు చేసినందుకు దేవాలయ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ పూజల్లో నియోజకవర్గం, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

## విద్యా వారోత్సవాల్లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపు





**మంచిర్యాల, మే 16 (క్రైమ్ మిర్రర్) :** విద్యార్థులు విద్యతో పాటు కళలు, క్రీడలు తదితర అన్ని రంగాల్లో ప్రతిభ కనబర్చాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాల్లో కళలు, హస్తకళలు, సాంస్కృతిక దినోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్యతో కలిసి కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వారోత్సవాలను ప్రత్యేకంగా నిర్వహిస్తూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. కోలాటం, తోలుబొమ్మలాట, బొమ్మల ప్రదర్శన, పేరిణి శివతాండవం, ఒగ్గు కథ, లంబాడి, ఆదివాసి నృత్యాలు, చిత్రలేఖనం, హస్తకళలు వంటి అంశాలపై విద్యార్థులు ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. కళలతో పాటు క్రీడా రంగంలోనూ రాణించాలని పేర్కొన్నారు.వివిధ రంగాల్లో నైపుణ్యం సాధించడం ద్వారా నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవడటంతో పాటు టీం వర్క్‌పై అవగాహన పెరుగుతుందన్నారు. గెలుపు, ఓటములు కంటే ప్రయత్నమే మొదటి విజయమని విద్యార్థులకు సూచించారు. వేసవి సెలవుల్లో ప్రత్యేక శిబిరాల ద్వారా విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బైక్‌పై నుంచి కిందపడి మృతి చెందిన మహిళ



**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం వెనుక చక్రాల్లో చీర చిక్కుకుపోయి కిందపడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం షేక్‌పేట్ ఓయూ కాలనీకి చెందిన బానోత్ మన్సింగ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. భార్య బానోత్ ధర్మిని(56), బానోత్ సంతోష్‌లు శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో టిజి24ఏ0502 నెంబర్ గల ద్విచక్ర వాహణంపై షేక్‌పేట్ నుంచి ఖానాపూర్‌లోని కీర్తి మసాలా హోటల్‌కు టీ తాగి తిరిగి వస్తుండగా ఖానాపూర్ చెక్‌పోస్టు సమీపంలో ఆమె ధరిఆంచిన చీర ద్విచక్ర వాహణం వెనుక చక్రానికి చుట్టుకోవడంతో కిందపడిపోయి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం గచ్చిబౌలిలోని కాంటినెంటల్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ




**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 16 :** జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సమావేశం, ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ వ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. ర్యాలీ అనంతరం జిల్లా మలేరియా అధికారి డా. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ఎడిస్ ఈజిప్టై అనే దోమ కుట్టడం వల్ల డెంగ్యూ వ్యాధి వస్తుందని తెలిపారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండే ప్రదేశాలు దోమల పెరుగుదలకు కారణమవుతాయని చెప్పారు. పాత టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, పాడైన కూలర్లు, నీటి ట్యాంకులు, ఫ్లవర్ వాసులు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి వారం ఒకరోజు డ్రై డేగా పాటించి నీటి నిల్వలను శుభ్రపరచాలని ప్రజలకు సూచించారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, శరీర నొప్పులు, దద్దుర్లు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆసుపత్రిలో చికిత్స పొందాలని తెలిపారు. దోమల నివారణకు ఇళ్లలో జాలీలు, దోమతెరలు ఉపయోగించాలని సూచించారు.జిల్లాలో డెంగ్యూ కేసులు క్రమంగా తగ్గుతున్నాయని అధికారులు తెలిపారు. 2022లో 344 కేసులు నమోదు కాగా, 2023లో 333, 2024లో 294, 2025లో 157 కేసులు నమోదైనట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డా. శశాంక్, మాస్ మీడియా ఆఫీసర్ ఎం. ప్రసాద్ వరకుమార్, ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ కె. వీరేశం, సబ్ యూనిట్ ఆఫీసర్ సుగుణకర్ తదితరులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లి సుమిత్రానగర్‌లో గంజాయి గుట్టు రట్టు



### 2.2 కిలోల డ్రై గంజాయి స్వాధీనం -- ఆరుగురు అరెస్ట్

### ఇద్దరు పెడ్లర్లు, నలుగురు వినియోగదారులు పోలీసుల అదుపులో

**కూకట్ పల్లి, మే 16 (క్రైమ్ మిర్రర్) :** సైబరాబాద్ కమిషనరేట్ కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సుమిత్రానగర్ ప్రాంతంలో గంజాయి అక్రమ వినియోగం, విక్రయాలపై పోలీసులు నిర్వహించిన ప్రత్యేక దాడిలో ఆరుగురిని అరెస్ట్ చేసి, భారీ మొత్తంలో డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, శుక్రవారం 15న సుమిత్రానగర్ ప్రాంతంలో గంజాయి విక్రయాలు, వినియోగం జరుగుతున్నట్లు కూకట్‌పల్లి పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే పై అధికారుల అనుమతి తీసుకొని, పోలీసు బృందం పంచ సాక్షులు, క్లూస్ టీమ్‌తో కలిసి ఆ ప్రాంతంలో ఆకస్మిక దాడులు నిర్వహించింది. దాడి సందర్భంగా మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఇద్దరు వ్యక్తులు గంజాయిని కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు, మరో నలుగురు అక్కడ గంజాయి సేవిస్తున్నట్లు వెల్లడైంది. అరెస్టు చేసిన నిందితులలో మొహమ్మద్ సమీర్ (24) బేకరీ కార్మికుడు, పెడ్లర్ ఇల్లూరి దీపక్ (24) -- మెకానిక్,అగ్రహారపు గోపీ (22) వినియోగదారు, నాను విష్ణు విజయాత్ (22) వినియోగదారు, మాచ యోగేష్ (24)వినియోగదారు, మద్దూరి శివ కుమార్ (24) -- వినియోగదారు. నిందితుల వద్ద నుండి మొత్తం 2 కిలోల 200 గ్రాముల డ్రై గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరచగా, కోర్టు వారిని జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ చేసింది. కూకట్‌పల్లి ప్రాంతంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.

# ఉప్పల్ వరంగల్ రూటులో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్: ఉప్పల్‌లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగు తున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉప్పల్ సర్కిల్‌లోని వరంగల్ బస్టాప్, యాదగిరిగుట్ట బస్టాప్‌లను నల్లచెరువు కట్ట సమీపానికి మార్చారు. ఉప్పల్ వద్ద వరంగల్ వైపు వెళ్లే రహదారిని ఆదివారం నుంచి తాత్కాలికంగా మూసివేయనున్నారు. హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలను జీఎస్ఐ వద్ద దారి మళ్లించనున్నారు. జీఎస్ఐ జంక్షన్ వద్ద బీరప్పగడ్డ మీదుగా ఎన్‌హెచ్-163 మీదకు డైవర్ట్ చేయనున్నారు.



# పాండురంగ నగర్ వీకర్ సెక్షన్‌లో ప్రజా సమస్యలపై మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పర్యటన

## కమ్యూనిటీ హాలు పునరుద్ధరణ, నీటి సరఫరా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ

**కూకట్ పల్లి, మే 16 (క్రైమ్ మిర్రర్) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పాండురంగ నగర్ వీకర్ సెక్షన్ ప్రాంతంలో శనివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా కమ్యూనిటీ హాల్ పై అంతస్తులో జరిగిన షార్ట్ సర్క్యూట్ కారణంగా హాలు పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ ఇప్పటివరకు పునరుద్ధరణ పనులు చేపట్టలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ వైరింగ్ మొత్తం కాలిపోవడంతో హాలు వినియోగానికి పనికిరాకుండా మారిందని తెలిపారు. దీంతో బస్తీ ప్రజలు వివిధ కార్యక్రమాలు నిర్వహించుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.అదేవిధంగా ప్రాంతంలో తాగునీటి సరఫరా తరచూ అంతరాయం కలుగుతోందని, ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు శ్రావణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను ఓపికగా విన్న ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార మార్గాలను అన్వేషిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా తూము శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలన్నింటినీ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుదృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందేలా నిరంతరం పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, బస్తీ అధ్యక్షులు అశోక్, రవీందర్, శ్రీనివాస్, మఖ్బుల్, కరుణాకర్, రవి, సంపత్, నాని, ఆనంద్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రంగారెడ్డి జిల్లా, మండలవారీగా, షాద్నగర్, కేశంపేట, కడ్తాల్, కందుకూరు, కొత్తూరు, తలకొండపల్లి అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈక్రింది నెంబరుకు సంప్రదించగలరు.
Email ID: crimemirrorts@gmail.com
9393 44 6188

# నాలుగు సార్లు గెలిచినా నాలుగు రోజులు నీళ్లివ్వలేరా?

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పై బీఆర్ఎస్ ఇంచార్జ్ పటోళ్ల కార్తీక్ రెడ్డి ధ్వజం
- నార్సింగిలో మహిళలతో కలిసి 'వాక్ ఫర్ వాటర్' భారీ పాదయాత్ర
- రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్చార్జి కార్తీక్ రెడ్డి విమర్శలు
- సమస్యలు పరిష్కారం కావాలంటే మళ్లీ కేసీఆర్ రావాలి



**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ప్రకాష్ గౌడ్, ప్రజలకు నాలుగు రోజులు కూడా సక్రమంగా మంచినీరు ఇవ్వలేకపోతున్నారని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్చార్జి పటోళ్ల కార్తీక్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. నియోజకవర్గంలో నెలకొన్న తీవ్ర మంచినీటి సమస్యపై ఆయన 'వాక్ ఫర్ వాటర్' పేరిట చేపట్టిన మూడు రోజుల పోరాటం శరవేగంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు నార్సింగి చౌరస్తా నుండి వాటర్ వర్క్స్ ఆఫీస్ వరకు మహిళలతో కలిసి భారీ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీవాసులు కార్తీక్ రెడ్డిని కలిసి, తాము ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులను వివరిస్తూ వినతి పత్రాలను అందజేశారు. పాదయాత్ర అనంతరం జరిగిన బహిరంగ సమావేశంలో కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ మంచినీటి సరఫరాపై స్థానిక ఎమ్మెల్యేకు కనీస అవగాహన లేకపోవడం వల్లే ప్రజలకు ఈ కష్టాలు వచ్చాయన్నారు. నియోజకవర్గంలో సరిపడా నీటిని అందిస్తున్నామని అధికారులు చెప్పడం వివేకశూన్యమని మండిపడ్డారు. పాదయాత్ర పొడవునా కనిపిస్తున్న వాటర్ ట్యాంకర్లే ఇక్కడి నీటి ఎద్దడికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. మేము మంచినీటి సమస్యపై పోరాటం ప్రారంభిస్తున్నామని తెలిసి, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఆఘమేఘాలపై అధికారులతో చర్చలు జరిపారు. ఇప్పటివరకు ఆయనకు ప్రజల సమస్యలు గుర్తుకు రాలేదా? రెండు, మూడు రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తుంటే అధికారులు ఎవరి కోసం పని చేస్తున్నట్లు? అని కార్తీక్ రెడ్డి ప్రశ్నించారు. కోకాపేట్‌లో భూములు అమ్ముకుని ప్రభుత్వం వందల కోట్ల రూపాయల ఆదాయాన్ని పొందుతున్నప్పటికీ, స్థానికులకు నీళ్లు ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులు పడుతోందని ధ్వజమెత్తారు. అధికారులు పాత బకాయిలు కట్టాలంటూ స్థానిక ప్రజలను ఇబ్బంది పెడుతున్నారే తప్ప, నీళ్లు మాత్రం ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రజలకు రోజు విడిచి రోజు తప్పనిసరిగా శుద్ధి చేసిన మంచినీటిని సరఫరా చేయాలి, నియోజకవర్గంలో మంచినీటి నల్లా బిల్లులను వెంటనే మాఫీ చేయాలి, రానున్న రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జంట జలాశయాల నుంచి రాజేంద్రనగర్ నియోజకవర్గానికి పూర్తి స్థాయిలో నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్‌కు ఏది కావాలన్నా గండిపేట మండలంపైనే ఆధారపడతారని, ఇక్కడి భూములు అమ్ముకుంటూ, టాక్సులు పెంచుతూ నీటి సమస్యను మాత్రం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో ప్రజలు సమస్యల నుంచి గట్టెక్కాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కార్తీక్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణను సాధించి చూపించిన ఘనత కేసీఆర్‌దేనని, అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజలు మళ్లీ 'సారు ఒక్కసారి రావాలి' అని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ 'వాక్ ఫర్ వాటర్' కార్యక్రమంలో దాదాపు 300 మందికి పైగా స్థానిక మహిళలు, ప్రజలతో పాటు నర్సింగ్ సర్కిల్ అధ్యక్షుడు కె. విష్ణువర్ధన్ రెడ్డి, రాజేందర్, మైనార్టీ అధ్యక్షుడు ముక్తార్, గణేష్ రెడ్డి, గణేష్ ముదిరాజ్, డాక్టర్ సాబ్, ఆనంద్, ఫారుక్, వృధాచార్యులు నరసింహ నిజాముద్దీన్ చిరంజీవి మల్లేష్ శ్రీకాంత్ రెడ్డి, రవి యాదవ్, ప్రవీణ్, శ్రీనివాస్, వెంకటేష్, క్రాంతి, వినోద్, మైపాల్, నరసింహ రాజు, సంతోష్ ఆంజనేయులు, జంగయ్య తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు తెలియని నాయకులు పాదయాత్రలు చేయడం హాస్యాస్పదం

## ఎమ్మెల్యేపై అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదు

## రాజకీయ పబ్బంగడుపుకోవడానికి బీఆర్ఎస్ నాయకులు కొత్త మోసాలకు పాల్పడుతున్నారు

## కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్

**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తే చూస్తు ఉరుకునే ప్రశక్తే లేదని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్‌లు ఆరోపించారు. ఈ మేరకు శనివారం బండ్లగూడలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ముఖ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ శుక్రవారం కార్తీక్‌రెడ్డి, స్వామిగౌడ్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు వాక్ ఫర్ వాటర్ అనే సబ్జెక్టు మీద కిస్మత్‌పూర్ వివేకానంద విగ్రహం, బండ్లగూడ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా వరకు పాదయాత్ర నిర్వహించారన్నారు. ఈ పాదయాత్ర నియోజకవర్గం మీద ఎటువంటి అవగాహన లేని నాయకులు రాజకీయ లబ్ధి గురించి నాలుగేళ్లకు ఒకసారి పబ్లిక్‌లోకి వచ్చి ఒక రెండు కిలోమీటర్లు పాదయాత్ర చేసి అది కూడా కాలనీల వాసులు కాకుండా వాళ్ల పార్టీకి సంబంధించిన, ఇతర ప్రాంతాలకు చెందిన నాయకులను పిలిపిఅంచుకోని ఈ రోడ్‌షో నిర్వహధించారన్నారు. పది రోజులకు ఒకసారి వాటర్ ఇవ్వడం లేదని విమర్శించారు, అలాగే ఎమ్మెల్యే నాలుగు సార్లు గెలిచారు నాలుగు రోజులు సరిగ్గా వాటర్ ఇవ్వలేదని అన్నారన్నారు. వారికి ఎటువంటి అవగాహన లేకుండా మాట్లాడడం జరుగుతుందన్నారు. ప్రజల్లో ఉండి పలు అభివద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు



కాబట్టి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. గతంలో ఇక్కడ మీరు చేసిన అభివద్ధి ఏమీలేదన్నారు. ప్రతి కాలనీలలో మూడు రోజులకు ఒకసారి, ఓల్డ్ విలేజ్‌లలో డే బై డే నీటి సరఫరా చేయడం జరిగందన్నారు. ఎప్పుడన్నా వాటర్ పైపులు డ్యామేజ్ అయినప్పుడే లేదా వాల్స్ రిపేర్ లేక మోటర్స్ కాలిపోయినప్పుడే ఇతర కరెంటు ఇబ్బందులు ఏమైనా ఏర్పడినప్పుడే ఒకటి లేదా రెండు రోజులు డిలే అవుతుందన్నారు. అంతకు తప్ప వాటర్ ఎప్పటికప్పుడు వచ్చేలా ఎమ్మెల్యే హెచ్‌ఎండబ్ల్యూయఎస్ అధికారులకు స్థానిక నాయకులతో కలిసి సూచనలు అందిస్తున్నారన్నారు. స్థానిక నాయకులకు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రలజకు ఇబ్బంది కాకుండా చూసుకోవాలని ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే చెప్పడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో వాటర్ సమస్య రావద్దని 10 ఏళ్ల కిందనే ఎంతో ఫైట్ చేసి నీళ్లు తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ది ఇక్కడున్న ప్రజలకు అందరికీ తెలుసు అన్నారు. స్థానిక నాయకులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎక్కడ ఇబ్బంది ఉన్న సరిదిద్దుకుంటూ ప్రజాసేవ చేస్తున్నారని అందరికీ తెలుసు కానీ బీఆర్ఎస్ నాయకుల పబ్లిక్ సిటీ గురించి ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరించోద్దని హెచ్చరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సాగర్‌గౌడ్, సురేష్‌గౌడ్, మాజీ యూత్ అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 16:** కార్మిక రంగ సంక్షేమానికి కృషి చేస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మరోసారి తన నిబద్ధతను చాటుకున్నారు. గుండెపోటుతో మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబానికి పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి రూ.5.50 లక్షల నష్టపరిహారం అందేలా చేశారు. వివరాల్లోకి వెళ్తే, ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడలో ఉన్న స్మార్కో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న కృష్ణారెడ్డి (35) మూడు రోజుల క్రితం విధుల్లో ఉండగా గుండెపోటుతో మృతి చెందాడు. అత్యంత నిరుపేద కుటుంబానికి చెందిన కృష్ణారెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి, బాధిత కుటుంబానికి తగిన సహాయం అందించాలని కోరారు. దీనికి స్పందించిన సంస్థ యాజమాన్యం రూ.5 లక్షల నష్టపరిహారం, అదనంగా రూ.50 వేల అంత్యక్రియల ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చింది. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తాను కార్మిక నేపథ్యం నుంచి రాజకీయాల్లోకి వచ్చానని, కార్మికుల కష్టాలు తనకు తెలుసునని అన్నారు. నియోజకవర్గంలోని కార్మికుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఐలా పటాన్‌చెరు అధ్యక్షుడు సుధీర్ రెడ్డి, పాశమైలారం వైస్ చైర్మన్ రాఘవరెడ్డి, అలాగే స్థానిక నాయకులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.




# మునీర్ వర్ధంతి సభ పోస్టర్ల ఆవిష్కరణ

**మందమర్రి, మే 16 (క్రైమ్ మిర్రర్) :** రాష్ట్ర సీనియర్ పాత్రికేయుడు ఎం.డి మునీర్ ప్రథమ వర్ధంతి సభను ఈ నెల 25న మందమర్రి మార్కెట్‌లోని వి.టి అబ్రహం స్థూపం వద్ద ఘనంగా నిర్వహించనున్నట్లు ఎఐటియుసి నాయకులు తెలిపారు. శనివారం వర్ధంతి సభ పోస్టర్లను కార్మిక సంఘ నాయకులు, మునీర్ శిష్య బృందం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మునీర్ కార్మిక సమస్యలపై తన కలంతో పోరాడిన జర్నలిస్టు అని కొనియాడారు. సభకు కార్మికులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గూడూరి యాదిరెడ్డి, ఎం.డి సంధాని, శైలేంద్ర సత్యనారాయణ, మునీర్ శిష్య బృందం తదితరులు పాల్గొన్నారు.

# జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 16 : ఓటరు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం అమలుకు కార్యాచరణ ప్రణాళిక విడుదల చేసిందన్నారు.

**కార్యక్రమం షెడ్యూల్:**

- జూన్ 15 నుంచి 24 వరకు సంబంధిత సిబ్బంది, అధికారులకు శిక్షణ
- ఎన్యూమరేషన్ ఫారాల ముద్రణ మరియు ఇతర ఏర్పాట్లు
- జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఫారాల పంపిణీ, సేకరణ
- జూలై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పూర్తి
- జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ
- జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ
- సెప్టెంబర్ 28 లోగా అభ్యంతరాల పరిష్కారం
- అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల
- ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభమయ్యేలోపు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో 1200 మందికి మించి ఓటర్లు లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, దివ్యాంగ ఓటర్ల నమోదుపై బూత్ స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మీడియా, సోషల్ మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి తప్పుడు ప్రచారాన్ని నిరోధించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి హాజరైన అడిషనల్ కలెక్టర్ సంగీత మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ పాండు, ఆర్డీఓ రాజేందర్, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 ఆదివారం 17-5-2026

# కూకట్ పల్లి నియోజకవర్గంలో “40 వేల ఓట్లు తొలగించారన్న
# ఎమ్మెల్యే కృష్ణారావు వ్యాఖ్యలు అవాస్తవం

**కూకట్ పల్లిలో సమస్యల పరిష్కారమే అసలు అభివృద్ధి**

**మూసాపేట సర్కిల్ పరిధిలోని ఆంజనేయనగర్‌లో పాదయాత్ర**

**ప్రజా సమస్యలపై అధికారులతో ఫోన్‌లోనే చర్చ**

**టిపిసిసి ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్**



**కూకట్ పల్లి, మే 16 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గంలో 40 వేల ఓట్లను అధికారులు తొలగించారంటూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ఎస్‌ఐఆర్ ప్రక్రియ పూర్తిస్థాయిలో ప్రారంభం కాకముందే 40 వేల ఓట్లు తొలగించారని ఎమ్మెల్యే ఎలా ప్రకటిస్తారని ఆయన ప్రశ్నించారు. “తొందరపడి కోయిల ముందే కూసినట్టుగా ఎమ్మెల్యే మాట్లాడుతున్నారు. అసలు ఆయన గెలిచిన మెజార్టీ ఈ దొంగ ఓట్ల వల్లేనా?” అంటూ బండి రమేష్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇప్పటివరకు నియోజక వర్గంలో అన్ని అభివృద్ధి పనులు పూర్తయ్యాయని చెప్పుకుంటూ వచ్చిన ఎమ్మెల్యే, ఇప్పుడు మళ్లీ కాలనీల్లో తిరుగుతూ “ఇక్కడ ఇది చేయాలి.. అక్కడ అది చేయాలి” అంటూ ప్రకటించడం ప్రజలను మభ్యపెట్టడమేనని ఆయన ఎద్దేవా చేశారు. శనివారం మూసాపేట ఆంజనేయనగర్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి బండి రమేష్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యలు, రహదారుల దుస్థితి, కమ్యూనిటీ హాళ్ల కొరత, పార్కుల అభివృద్ధి, శాంతిభద్రతల సమస్యలు తదితర అంశాలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై బండి రమేష్ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన రహదారులపై అక్రమ కార్ పార్కింగ్ కారణంగా ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయని పేర్కొంటూ ట్రాఫిక్ అధికారులతో కూడా మాట్లాడారు. మూసాపేట వై జంక్షన్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి, జేఎన్‌టీయూ సమీపంలో స్కైవాక్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. భరత్‌నగర్ కూరగాయల మార్కెట్ ఎన్నో సంవత్సరాలుగా బ్రిడ్జి కిందే కొనసాగుతోందని, మార్కెట్‌కు శాశ్వత స్థలం ఇప్పించడంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని బండి రమేష్ విమర్శించారు. ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిరక్షణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ సభ్యులు, టెంపుల్ కమిటీ ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ, మైనారిటీ, ఎస్సీ సెల్, బీసీ సెల్, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ అభిమానులు పాల్గొన్నారు.



## లోధా బెలెజ్జ అపార్ట్మెంట్లో భారీ అగ్నిప్రమాదం

**భయభ్రాంతులకు గురైన స్థానిక ప్రజలు**

**కూకట్పల్లి, మే 16 (క్రైమ్ మిర్రర్):** కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీ నాలుగో ఫేస్ లోని లోదా బెలజ్జా అపార్ట్మెంట్ సముదాయం లోని ఓ ఫ్లాట్లో శనివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం కమ్యూనిటీ పరిధిలోని 2 బి టవర్ లో ఉన్న ఫ్లాట్ నెంబర్ 29,30 లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఈ ప్రమాదం సంభవించినట్టు అగ్నిమాపక శాఖ అధికారులు నిర్ధారించారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రాణం నష్టం తప్పింది. అపార్ట్మెంట్లోని ఫర్నిచర్, గృహోపకరణాలన్నీ దగ్ధమయ్యాయని ఫైర్ సిబ్బంది తెలిపారు. బహుళ అంతస్తుల నిర్మాణం కావడంతో సమీప ఫ్లాట్ యజమానులు కింది పై అంతస్తుల నివాసితులు భయాందోళనలకు గురయ్యారు. ఇంటి యజమానులు లేకపోవడంతో నష్టాన్ని అంచనా వేయలేకపోయారు.

## రోడ్డు ప్రమాదాలకు చెక్... పోలీసుల వినూత్న ప్రయోగం

**గేదెల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు.**

**రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు.. ఎస్ఐ సైదిరెడ్డి**



**క్రైమ్ మిర్రర్, హుజూర్ నగర్ (నేరేడుచర్ల):** పశువుల వల్ల సంభవించే రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు నేరేడుచర్ల పోలీసులు వినూత్న కార్యక్రమం చేపట్టారు. గేదెల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు అమర్చారు.జాతీయ రహదారిపై రాత్రి వేళల్లో పశువుల వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ సైదిరెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం లో స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మూగజీవులు, మనుషులకు రోడ్డు ప్రమాదం జరగకుండా ఉండడానికి సూర్యాపేట జిల్లా ఎస్పీ ఆదేశానుసారం, కోదాడ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, హుజూర్నగర్ సిఐ చరమంద రాజు సూచనల మేరకు మూగజీవాల కొమ్ములకు రేడియం స్టిక్కర్లను అంటిస్తున్నామని, ఈ కార్యక్రమం శనివారం చిల్లేపల్లి గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవికాలంలో మేతకోసం రైతులు పశువులను వదులుతారు రాత్రి వేళలో పశువుల రోడ్డు దాటుతుండగా ప్రమాదాలు జరిగి మనుషులు పశువులు చనిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఈ ప్రమాదాల అరికట్టటానికి పశువుల కొమ్ములకు రేడియం స్టిక్కర్ అంటించి ప్రమాదాల నివారణకు తమ వంతు బాధ్యతగా రైతులకు అవగాహన కలిగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మనోజ్, రైతులు పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యపై ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్

**రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యావర్గ సభ్యులు, కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్ నిరుడు శేఖర్‌ముదిరాజ్**



**గండిపేట(క్రైం మిర్రర్):** తాగునీటి సమస్యపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యావర్గ సభ్యులు, కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్ నిరుడు శేఖర్‌ముదిరాజ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపాలిటీలో వాక్ ఫర్ వాటర్ పేరుతో బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన కార్యక్రమంపై రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యావర్గ సభ్యులు, కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్ నిరుడు శేఖర్‌ముదిరాజ్ తీవ్రంగా స్పందించారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు శాశ్వత తాగునీటి పరిష్కారం చూపడంలో పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి మిషన్ భగీరథ పైపులైన్లు వేశామని గొప్పలు చెప్పుకున్న నాయకులు ఈ రోజు అదే నీటి సమస్యపై రోడ్డెక్కి ధర్నాలు చేయడం హాస్యాస్పదమని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలు కనిపించని బీఆర్ఎస్ నాయకులకు ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక వాక్ ఫర్ వాటర్ అంటూ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు త్రాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా పరిస్థితుల్లో ఎలాంటి మారుప లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి గత రెండు సంవత్సరాలుగా ప్రజలను పూర్తిగా మోసంం చేస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతూ కాలం గడుపుతొందని అన్నారు. ప్రజల ముఖ్య సమస్యలైన తాగునీరు, విద్యుత్, ఉపాధి, రైతుల ఇబ్బందులు, మహిళల సమస్యలను పట్టించుకోవడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు ప్రజలను మోసం చేయడంలో ఒకదానికొకటి పోటీ పడుతున్నాయని, ఒక పార్టీ పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకుంటే మరో పార్టీ హామీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేస్తుందని ధ్వజమెత్తారు. ప్రజల సమస్యలపై నిజాయితీగా పోరాడుతూ, ప్రజలకు శాశ్వత పరిష్కారాలు అందించాలనే లక్ష్యంతో భారతీయ జనతా పార్టీ పని చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం దేశవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పని చేస్తుంటే రాష్ట్రంలో మాత్రం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజా సమస్యలను రాజకీయాల కోసం వాడుకుంటున్నాయని విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రజలే ఈ రెండు పార్టీలకు తగిన గుణపాఠం చెబుతారని, ప్రజల ఆశలు నెరవేర్చగలిగేది బీజేపీ మాత్రమేనని స్పష్టం చేశారు.



## శని జయంతి సందర్భంగా శ్రీ శనైశ్చర ఆలయంలో ప్రత్యేక పూజలు

**శంషాబాద్ మదనపల్లి లోని శనిశ్వరుడిని దర్శించుకున్న మాజీ కౌన్సిలర్ ఉషారాణి**

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** శంషాబాద్ సమీపంలోని మదనపల్లిలో ఉన్న శ్రీ శనీశ్వరుడి ఆలయంలో శని జయంతి సందర్భంగా శనివారం నార్సింగి మాజీ కౌన్సిలర్ ఉషారాణి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.శని జయంతి మరియు అమావాస్య ఒకే రోజు రావడంతో భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తులు స్వామివారికి తైలాభిషేకం నిర్వహించి, నువ్వుల దానం చేసి, నిమ్మకాయల మాలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు....

## ధరలు అదుపు చేయలేని దద్దమ్మ ప్రభుత్వం కేంద్రంలో పాలిస్తున్నది

**మోడీ హాయంలో కార్పొరేట్లు పెట్టుబడిదారులు లాభాలు అర్జిస్తున్నారు**

**సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య**




**గండిపేట(క్రైం మిర్రర్):** ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయిందని, కార్పొరేట్ దోపిడిదారులకు నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుకూలంగా ధరలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి జాతీయ నాయకుడు పాలమాకుల జంగయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ పై మూడు రూపాయల చొప్పున ధరలు పెరిగాయని ఈ ధరల పెరుగుదల సామాన్యులపై తీవ్ర ప్రభావాన్ని చూపిందని జంగయ్య విమర్శించారు. శనివారం పెట్రోల్, డీజిల్ ధరలను నిరసిస్తూ సిపిఐ శంషాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడారు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ దోపిడి వర్గాలకు కొమ్ముకాస్తూ సామాన్య ప్రజలను గాలికి వదిలేసిందని దాని ఫలితంగానే వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్, ధరలు పెరుగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రజలు తిరుగుబాటు వైపు రాకుండా మతాన్ని కులాన్ని జైశ్రీరామ్ నినాదాలతో పక్కదారి పట్టించే ప్రయత్నం బిజెపి ప్రభుత్వం చేస్తున్నదని ఆయన విమర్శించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ ఎన్నికలకు ముందు ప్రజలకు చాలా హామీలు ఇచ్చారు, ఏ ఒక్క హామీ అమలు చేయలేదని పర్వతాలు మండిపడ్డారు. అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్ పైన చేస్తున్న యుద్ధం వల్ల పెట్రోల్, డీజిల్, వంటగ్యాస ధరలు పెరుగుతున్నాయని దీనిని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన విమర్శించారు. ఈ నిరసన ధర్నా కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి. రామకృష్ణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్. యాదగిరి, మండల కార్యదర్శి కే. చందు యాదవ్, నాయకులు చంటి, శ్రీనివాస్, నారాయణ, రఘు, మధు, శ్రీను, అనిత తదితరులు పాల్గొన్నారు.

## డీజిల్ పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని...హైదరాబాద్ - శ్రీశైలం రహదారిపై ధర్నా రాస్తారోకో

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ వెల్దండ మండల కేంద్రంలో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్- శ్రీశైలం ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే జయపాల్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి 24 గంటలు గడుస్తున్న రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు రేవంత్ రెడ్డికి బిజెపి ప్రభుత్వానికి మధ్య ఉన్న స్నేహ ఏంటో ప్రజలకు తెలుసని ఆయన అన్నారు.



కేవలం ఎన్నికల కోసమే ఎన్ని రోజులు పెట్రోల్ డీజిల్ పెంపకాన్ని ఆపి ఎన్నికలయ్యాక ఒక్కసారిగా నీడ పై మూడు రూపాయల చెప్పు నొప్పించడంతో పేద మధ్యతరగతి ప్రజలపై భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించకపోతే భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రపాలనగరంలో వడ్లతో బిఆర్ఎస్ రాజకీయం

## మేము వడ్లు పోసుకున్న స్థలం వద్దే ముందు కొనుగోలు చేయాలని పంతం

### మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి



**ఆత్మకూరు(ఎం),మే16/క్రైమ్ మిర్రర్:** బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం నుండి గ్రామ ప్రాంతంలోని నాయకుల వరకు అందరిదీ ఒకే రకమైన అరాచకం.ప్రభుత్వం ఏ పని చేసిన, ఏ అభివృద్ధి చేసిన అడ్డుకోవడం రాజకీయ చేయడం పరిపాటిగా మారింది.అందులో భాగంగానే రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరంలో కూడా వడ్లతో స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు రాజకీయం చేస్తూ గ్రామ రైతులను, అధికారులను గందరగోళంలో పెడుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రామన్నపేట మండలంలో అత్యధికంగా వరి సాగు చేసే కొన్ని గ్రామాలలో ఇంద్రపాలనగరం ఒకటి. వరి దిగుబడికి తగ్గట్టుగానే గ్రామంలో ప్రభుత్వం, అధికారులు ఐకెపి, పిఏసిఎస్ ఆధ్వర్యంలో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి సాఫీగా కొనుగోలను నిర్వహిస్తున్నారు. ఆ గ్రామ సర్పంచ్, బిఆర్ఎస్ నాయకులు రైతులకు ఇబ్బంది కలగకుండా అధికారులకు సహకరించాల్సింది పోయి ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. కావాలని ఎమ్మెల్యే వేముల వీరేశమును, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద రాజకీయ కుట్ర చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న రెండు కొనుగోలు కేంద్రాలలో రైతులు వడ్లు పోయడానికి స్థలం ఉన్నప్పటికీ, కొనుగోలు సాఫీగా సాగుతున్నప్పటికీ సర్పంచ్ అనుయాయులు, బిఆర్ఎస్ నాయకులు మరొకచోట వడ్లు రాశులు పోసి మా వద్దే ముందు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తూ ఇబ్బంది పెడుతున్నారు. రెండు దాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు పూర్తయిన తర్వాత అక్కడ కూడా ధాన్యం కొనుగోలు చేస్తామని చెబుతున్న పట్టించుకోకుండా రాద్దాంతం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కావాలని ఎమ్మెల్యేను, ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళన నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. రైతులకు మేలు చెయ్యకపోగా బిఆర్ఎస్ నాయకులు రైతులను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన అన్నారు. టిఆర్ఎస్ పార్టీ నాయకులు అరాచకాలు ఇలాగే కొనసాగితే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తగిన బుద్ధి చెబుతామని, ఎమ్మెల్యేను బదనం చేస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## లిఫ్ట్‌లో కిందకు వెళ్తూ ప్రమాదానికి గురైన మణికొండ బీఆర్ఎస్ నాయకులు





**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రజలకు రాజ్యాంగడం కల్పించిన నీటి హక్కుల కోసం జరుగుతున్న వాక్ ఫర్ వాటర్ సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. మణికొండ డాలర్ హిల్‌లో ఉదయం జరిగిన సమావేశం అనంతరం కొంత మంది లిఫ్ట్‌లో దఫాలుగా కిందికి దిగడం, తనదంతరం మిగిలిన వారితో పాటు బీఆర్ఎస్ నాయకులు కుంభగల్ల ధనరాజ్, యాలాల కిరణ్‌లు లిఫ్ట్‌లో కిందకు వెళ్తున్న క్రమంలో బ్యాలెన్స్ తప్పి దుర్ఘటన జరిగింది. యాదృచ్చికంగా జరిగిన సంఘటనలో ఎవరి ప్రమేయం లేదని గంటా పదముగా తెలియపరుస్తున్నామన్నారు. కాలికి గాయాలు అయిన సందర్భంగా మేము మాతో పాటు లిఫ్ట్‌లో ఉన్న ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నామని తెలిపారు. ఈ విషయమై మా ఆరోగ్య పరిస్థితిని ప్రత్యేక్షంగా, పరోక్షంగా పరామర్శించిన మిత్రులందరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సంక్షేమం కోరుతూ మే 17 ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించతలపెట్టిన వాక్ ఫర్ వాటర్ కార్యక్రమాన్ని విల్లల భవిష్యత్తు దృష్ట్యా విజయవంతం చేయాలని అందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## సామాన్యుడి నడ్డి విరుస్తున్న మోడీ ప్రభుత్వం

### పెంచిన పెట్రోల్, డిజిల్ ధరలు వెంటనే ఉపసంహరించుకోవాలి: హరీష్‌గౌడ్



**గండిపేట(క్రైం మిర్రర్):** సామాన్యుడి నడ్డి విరిచేలా కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం పెట్రోల్, డిజిల్ ధరలను పెంచుతుందని హరీష్‌గౌడ్ అన్నారు. ఇటీవల వివిధ రాష్ట్రాల్లో జరిగిన శాసన సభ ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకొని మోడీ ప్రభుత్వం పని చేసిందన్నారు. ఎలక్షన్స్ అయిపోగానే పెట్రోల్, డిజిల్ విషయంలో మళ్లీ సామాన్యుడికి అన్యాయం చేసిందన్నారు. నిత్యవసర సరుకుల ధరలు ఆధారపడి ఉండే పెట్రోల్, డిజిల్ ధరలు పెరగడం వల్ల వాటి ధరలు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. మొన్నటి వరకు ఎటువంటి ధరలు పెంచం అని ప్రకటించిన ఎన్‌డిఏ ప్రభుత్వం శాసన సభ ఎలక్షన్ల ఓట్ల కోసం సమాన్యుడిని వాడుకుందన్నారు. ఎన్నికలు గడిచిన నెల రోజులు తిరతగకముందే పెట్రోల్, డిజిల్ మీద అమాంతం మూడు రూపాయలు పెంచడం హేయమైన చర్య అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే ద్రవయోల్బణం పెరిగే అవకాశం ఉండదు, పెట్రోల్, డిజిల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తీసుకోని వస్తే సామాన్యుడికి లాభం చేకూరుతుందన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం అటువంటి పని చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో త్వరత్వరగా కొనుగోలు చేయాలి

**ఆత్మకూరు(ఎం),మే16/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం శనివారం రోజు మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు కాక, అయింది లారీలు రాకపోవడం, రైస్ మిల్లుల్లో దిగుమతులు త్వరత్వరగా చేయకపోవడం వల్ల కొనుగోలు కేంద్రాల్లోనీ ధాన్యం వర్షాకాలం వచ్చే సరికైన కొనుగోలు చేస్తారనే ఆశలు కనుచూపు మేరలో కూడా లేదని అంటున్న రైతులు. మిల్లుల్లో బస్తాకు 2 నుంచి 3 కిలోల వరకు తరుగని, షార్టేజీ అని ఏవేవో కొర్రీలు పెడుతున్న రైస్ మిల్లు యాజమాన్యం, లారీల నుంచి త్వరత్వరగా ధాన్యం దీగుమతి చేసుకోకపోవడం వలన 3,4 రోజులు ఆగి ఉన్నందున లారీల యాజమానులు బస్తాకు 3రూ,, ల నుంచి 5 రూ,, ల వరకు వసులు చేస్తున్నారు. ప్రభుత్వం ఏన్నో చెప్పుతుంది కానీ అవి మాటల వరకే ఆచరణలో కనబడకపోవడంతో ఇబ్బందులు పడుతున్న రైతులు. ప్రభుత్వం అధికారులు స్పందించి కొనుగోలు జరిగేలా చూడాలని కోరుతున్న రైతులు.



## ప్రణాళికా బద్ధంగా నర్సాబాయికుంటను అభివృద్ధి చేస్తాం

### జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి

**వీరాంజనేయ స్వామి దేవాలయం వెనుక వైపు రిటర్నింగ్ వాల్ నిర్మించాలని వినతి**




**గండిపేట(క్రైం మిర్రర్):** మార్కండేయనగర్--బాబుల్‌రెడ్డినగర్ బస్తీల నడుమ ఉన్న నర్సాబాయికుంట అభివృద్ధి విషయంలో స్వయంగా పర్యటించి కావాల్సిన చర్యలు తీసుకోనున్నట్లు జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సైతం నర్సాబాయికుంట అభివద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని, అందుకు కావాల్సిన నిధులు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయిస్తానని ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో సూచించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. శనివారం మార్కండేయనగర్ బస్తీకి చెందిన సత్యసాయి పొదుపు సంఘం అధ్యక్షుడు పి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో స్థానికులు జోనల్ కమిషనర్‌ను కలిసి నర్సాబాయికుంటకు రిటర్నింగ్ వాల్ నిర్మించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నర్సాబాయికుంట రిటర్నింగ్ వాల్‌తో పాటు పార్కు అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారని తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో తానే స్వయంగా వివిధ విభాగాల అధికారులతో కలిసి నర్సాబాయికుంట ప్రాంతంలో పర్యటించి ప్రణాళిక బద్ధంగా అభివద్ధి చేయడానికి కావాల్సిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి పొదుపు సంఘం సలహాదారులు ఏర్వ సత్యనారాయణ, గద్దె యాదగిరి, ప్రధాన కార్యదర్శి కోట శ్యాంకుమార్, ఉపాధ్యక్షుడు మునగపాటి విష్ణు, సంయుక్త కార్యదర్శి కర్నాటి శ్రీనివాస్, కోశాధికారి కోట పవన్‌కుమార్, పాలకవర్గ సభ్యులు గంజి నరేష్, భూసం భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

## వెండి దిగుమతులపై ఆంక్షలు

### ఆదేశాలు జారీ చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో సంక్షోభం వేళ ఇటీవల బంగారం, వెండి దిగుమతులపై సుంకాన్ని పెంచిన కేంద్ర ప్రభుత్వం, తాజాగా మరిన్ని చర్యలు తీసుకుంది. వెండి దిగుమతులపై ఆంక్షలు విధించింది. స్వేచ్ఛా విధానం నుంచి పరిమిత విధానానికి సవరించింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని విదేశీ వాణిజ్య విభాగ డైరెక్టరేట్ జనరల్ ఓ నోటిఫికేషన్‌లో తెలిపింది. ఆంక్షల విభాగంలో ఉండే వస్తువులను దిగుమతి చేసుకోవాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. విదేశీ మారకపు ద్రవ్యాన్ని జాగ్రత్తగా వాడుకునేందుకు వీలుగా బంగారం కొనడాన్ని ఏడాదిపాటు ఆపేయాలని ప్రధాని మోదీ ఇటీవల పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే బంగారం, వెండి దిగుమతులను నియంత్రిం చేందుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. ఈ రెండు లోహాల దిగుమతులపై సుంకాన్ని 6 నుంచి 15 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. తాజాగా వెండి దిగుమతిపై ఆంక్షలు విధించడం గమనార్హం.

## మైనర్ బాలిక వాంఙ్మూలం నమోదు

హైదరాబాద్: మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌పై పోక్సో కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బాధితురాలి వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు. మేడ్చల్ మెజిస్ట్రేట్ ఎదుట బాధితురాలు, ఆమె తల్లి వాంగ్మూలాలను 40 నిమిషాల పాటు రికార్డు చేశారు. ఇప్పటికే బాధితురాలి వాంగ్మూలాలను రెండుసార్లు పోలీసులు నమోదు చేశారు. మరోవైపు, భగీరథ్ దేశం దాటిపోకుండా పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. అతడి కోసం 5 బృందాలు గాలిస్తున్నాయి. భగీరథ్‌పై పోక్సో కేసు నమోదవ్వడంతో అతడితో టచ్‌లో ఉన్నవారిపై, స్నేహితులు, బంధువుల ఇళ్లపై పోలీసులు నిఘా ఉంచినట్లు సమాచారం. బంజారాహిల్స్‌లోని బండి సంజయ్ ఇంట్లో ఒక బృందం తనిఖీలు చేపట్టింది.

## గన్నవరం ఎయిర్‌పోర్టు మూసివేత అంటూ దుష్ప్రచారం

### తప్పుడు ప్రచారాలను నమ్మొద్దన్న ప్రభుత్వం

విజయవాడ: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం మూసివేస్తారంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఏపీ ప్రభుత్వం ఖండించింది. ఇది పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేస్తూ ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టింది. గన్నవరం ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల రద్దీని తట్టుకొనేందుకు రూ.611.80 కోట్ల అంచనా వ్యయంతో నూతన ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపింది. దీన్ని త్వరలోనే ప్రారంభించేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నట్లు తెలిపింది. అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ఒక దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రాజెక్ట్. రాజధాని అమరావతి పరిధిలోని గుంటూరు జిల్లా, తాడికొండ మండలం రావెల గ్రామ సమీపంలో సుమారు 4,618 ఎకరాల్లో కొత్త గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు సిద్ధమయ్యారు. అయితే, ఇది భవిష్యత్తులో అమరావతిని గ్లోబల్ ఏవియేషన్ హబ్‌గా, విమానాల మరమ్మతుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన దీర్ఘకాలిక ప్రాజెక్టు. రెండు విమానాశ్రయాలూ కలిసే కొనసాగుతాయి. మెట్రో నగరాలు, అభివృద్ధి చెందుతున్న రాజధాని ప్రాంతాల్లో ఒకటి కంటే ఎక్కువ విమానాశ్రయాలు ఉండటం సాధారణం. అదే విధంగా అమరావతిలో కొత్త ఎయిర్‌పోర్ట్ వచ్చినా, విజయవాడ గన్నవరం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ యథావిధిగా తన సేవలను కొనసాగిస్తుంది.

## పగటిపూట వెలుగు తున్న వీధి దీపాలు



**ఆత్మకూరు(ఎం),మే16/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలోని గ్రామాల్లో వీధి దీపాలు పగటి పూట వెలుగుతున్నాయి. ఇలా వెలగటం వలన గ్రామ పంచాయతీలకి అదనపు భారం పడుతుంది. గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల పగటిపూట వీధి దీపాలు వెలుగుతున్నాయి అని ఆయాగ్రామాల ప్రజలు వారి అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారులు స్పందించి గ్రామాల్లో పగటిపూట వీధి దీపాలు వెలుగ కుండా చూడాలని కోరుతున్నారు.

## జవహర్ నగర్ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- నేపాలీ దంపతులతో పాటు మరొకిరి అరెస్ట్
- నిందితుల నుంచి నగదు, బంగారం స్వాధీనం

హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని జవహర్‌నగర్‌లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. వృద్ధ దంపతులను కట్టేసి ఇంట్లో చోరీ చేసిన నేపాలీ ముఠాలో కీలక నిందితులను అరెస్ట్ చేశారు. ఈ నెల 12న జరిగిన చోరీలో నేపాలీ దంపతులు మమత, రమేశ్‌తోపాటు సబీనాను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి బంగారం, వెండి, నగదును స్వాధీనం చేసుకున్నారు. 8 మంది నేపాలీ ముఠా సభ్యులు చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసు వివరాలను మల్కాజ్‌గిరి సీపీ సుమతి మీడియాకు వెల్లడించారు. ఈ చోరీ కేసును 250కి పైగా సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించడంతో లభించిన క్లూస్ ఆధారంగా 72 గంటల్లో ఈ కేసును ఛేదించినట్లు మల్కాజ్‌గిరి సీపీ సుమతి వెల్లడించారు. పక్కా ఎ÷-లాన్‌తో ఇంట్లోకి ప్రవేశించి చోరీకి తెగబడిన ఈ ముఠాలో నలుగురిని అరెస్టు చేశామని, మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. మీనా అలియాస్ మమత పుట్టిన రోజు వేడుకల కోసం మిగతా వారు వచ్చారని యజమానులను నమ్మించి.. వృద్ధ దంపతులను కట్టేసి ఈ ముఠా చోరీకి పాల్పడిందని వివరించారు. ఇకపై ఇంటి యజమానులు ఎవరైనా పనిలో పెట్టుకొనేవారి వివరాలను తాము రూపొందించిన యాప్‌లో నిక్షిప్తం చేయాలని సుమతి సూచించారు.

# నెలసరి సమయంలో మొటిమలు వస్తున్నాయా



నెలసరి సమయంలో హార్మోన్ల మార్పుల వల్ల ముఖంపై మొటిమలు రావడం మహిళలకు సర్వసాధారణమైన సమస్య. ఈ నొప్పి కలిగించే మొటిమలను తగ్గించుకోవడానికి ఖరీదైన క్రీములు అవసరం లేదు. చర్మవ్యాధి నిపుణులు మొటిమల్ని నియంత్రించడానికి సున్నితమైన క్లెన్సింగ్, నాన్-కొమెడోజెనిక్ మాయిశ్చరైజర్లు, సాలిసిలిక్ యాసిడ్ లేదా బెంజోయిల్ పెరాక్సైడ్ వంటి పదార్థాలు కలిగిన ఉత్పత్తుల్ని వాడే స్థిరమైన చర్మ సంరక్షణ దినచర్యను పాటించాలని సూచిస్తున్నారు. చాలామంది మహిళలు ఎదుర్కొనే అతిపెద్ద సమస్యల్లో నెలసరి సమయంలో వచ్చే మొటిమలు ఒకటి. నెలసరి తేదీలకు కొన్ని రోజుల ముందు నుంచి ముఖంపై, ముఖ్యంగా దవడ భాగంలో మొటిమలు రావడం సర్వసాధారణం. పీరియడ్స్ సమయంలో జరిగే హార్మోన్ల మార్పులు మొటిమలు రావడానికి గల అత్యంత సాధారణ కారణాల్లో ఒకటి. అమెరికన్ అకాడమీ ఆఫ్ డెర్మటాలజీ వారి సమాచారం ప్రకారం ఋతుస్రావానికి ముందు ఆండ్రోజెన్ హార్మోన్ అధికంగా విడుదల కావడం వల్ల సెబేషియస్ గ్రంథులు ఎక్కువ నూనెను ఉత్పత్తి చేస్తాయి. ఇది చర్మ రంధ్రాల్ని మూసివేసి మొటిమలకు కారణం కావచ్చు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ ద్వారా అందుబాటులో ఉన్న పరిశోధన ప్రకారం, ఋతుచక్రంలోని ల్యూటియల్ దశలో హార్మోన్ల హెచ్చుతగ్గులు చర్మంలో సెబమ్ ఉత్పత్తిని, వాపును పెంచుతాయి. దీనివల్ల ఋతుస్రావానికి ముందు లేదా ఆ సమయంలో మొటిమలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని కూడా తెలుస్తోంది. ఈ సమస్యకు పరిష్కార మార్గాల్ని నిపుణులు సూచించారు. కొన్ని చిన్నపాటి జీవనశైలి మార్పులతో ఈ మొటిమలను నియంత్రించవచ్చు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

**హార్మోన్ల మార్పులే ప్రధాన కారణం**

నెలసరి సమయంలో శరీరంలో జరిగే హార్మోన్ల హెచ్చుతగ్గులు చర్మంపై నేరుగా ప్రభావం చూపుతాయి. ఈ సమయంలో ఈస్ట్రోజన్, ప్రజెస్టిరాన్ హార్మోన్ల స్థాయిలు గణనీయంగా తగ్గుతాయి. అదే సమయంలో టెస్టోస్టిరాన్ హార్మోన్ల ప్రభావం పెరుగుతుంది. ఈ హార్మోన్ మార్పుల వల్ల చర్మ గ్రంథులు ఎక్కువ ఆయిల్‌ను ఉత్పత్తి చేస్తాయి. చర్మంలో సీబమ్ శాతం పెరగడం వల్ల సమస్య మొదలవుతుంది. ఈ ఆయిల్ చర్మంపై ఉండే చనిపోయిన కణాలతో కలిసిపోయి చర్మ రంధ్రాలను మూసివేస్తుంది.

**ఒత్తిడి, ఆహారపు అలవాట్ల ప్రభావం**

హార్మోన్లతో పాటు జీవనశైలి కూడా మొటిమల తీవ్రతను పెంచుతుంది. విపరీతమైన ఒత్తిడి, ఎక్కువ చక్కెర పదార్థాలు తీసుకోవడం, నిద్రలేమి వల్ల శరీరంలో కార్టిసాల్ అనే హార్మోన్ పెరుగుతుందని నిపుణులు తెలిపారు. ఇది శరీరంలో మంటను పెంచి, మొటిమల తీవ్రతను రెట్టింపు చేస్తుంది. హార్మోన్ల అసమతుల్యతతో పాటు ఈ చెడు అలవాట్లు తోడైతే చర్మ ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుంది. కాబట్టి ఈ సమయంలో ఆహారం విషయంలో ప్రత్యేక జాగ్రత్త అవసరం.

**వీటిని తింటే మొటిమలు తగ్గుతాయి**

మొటిమలను నివారించడంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. శరీరానికి తగినంత తేమ అవసరం. కాబట్టి రోజూ కనీసం మూడు లీటర్ల నీటిని తాగడం తప్పనిసరి. నీరు శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపి, చర్మంపై ఆయిల్ ఉత్పత్తిని క్రమబద్ధీకరిస్తుంది. ఆహారంలో పసుపు పాలు చేర్చుకోవడం ద్వారా చర్మంపై మంట తగ్గుతుంది. అంతేకాకుండా వాల్‌నట్స్, ఫ్లాక్స్ సీడ్స్ వంటి వాటిని తీసుకోవడం ఎంతో మంచిది. ఇవి చర్మానికి అవసరమైన మంచి కొవ్వులను అందిస్తాయి. జింక్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకుంటే మొటిమలు తగ్గుముఖం పడతాయి.

**ఏం తినకూడదు?**

ఏ ఆహార పదార్థాలు మొటిమలను పెంచుతాయో తెలుసుకోవడం ముఖ్యం. నెలసరి సమయంలో పాల పదార్థాలకు దూరంగా ఉండటం మంచిది. పాలలోని కొన్ని అంశాలు చర్మంపై మొటిమలను ప్రేరేపిస్తాయి. అలాగే చక్కెర ఎక్కువగా ఉండే మిఠాయిలు, స్వీట్లు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను పూర్తిగా మానేయాలి. చక్కెర పదార్థాలు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచి, హార్మోన్ల అసమతుల్యతను మరింత తీవ్రతరం చేస్తాయి. ఈ చిన్న మార్పులు చర్మ ఆరోగ్యంలో పెద్ద తేడాను తీసుకువస్తాయి. చర్మంపై ఉండే అదనపు ఆయిల్‌ను తొలగించడానికి తేలికపాటి సబ్బులు లేదా ఫేస్ వాష్ ఉపయోగించి ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. రోజుకు రెండుసార్లు కడుక్కోవడం సరిపోతుంది. అలా అని అతిగా ముఖాన్ని కడుక్కోవడం వల్ల చర్మం మరింత పొడిగా మారి ఎక్కువ ఆయిల్ ఉత్పత్తికి దారితీస్తుంది. వీటితో పాటు తగినంత నిద్ర అవసరం. నిద్రలేమి ఒత్తిడిని పెంచి మొటిమలకు కారణమవుతుంది. కాబట్టి రోజుకు ఏడు నుండి ఎనిమిది గంటల నిద్ర ఉండేలా చూసుకోవాలి. ఈ చిట్కాలు పాటిస్తూ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

# తినే పనీర్ కల్తీదా లేదా స్వచ్ఛమైనదా?



వంటగదిలో అమృతప్రాయంగా భావించే పన్నీర్.. అవకాశవాదుల దురాశకు బలవుతూ కల్తీ కోరల్లో చిక్కుకుని తన స్వచ్ఛతను కోల్పోతోంది. ప్రాణాంతకమైన కెమికల్స్ వినియోగంతో ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తోంది. మార్కెట్ ఆర్టిఫిషియల్ పనీర్ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. దీనికి అప్రమత్తతే పరిష్కారం. ఈ నేపథ్యంలో కల్తీ పన్నీర్ వల్ల కలిగే నష్టాలు ఏంటి? ఇంట్లోనే ఈ కల్తీ పనీర్‌ను ఎలా గుర్తించాలి? భద్రతా ప్రమాణాలు ఏంటి? వంటి విషయాల గురించి తెలుసుకుందాం.. ప్రస్తుతం భారతీయ వంటకాల్లో పన్నీర్ ప్రధాన భాగమైపోయింది. పన్నీర్ అధిక ప్రోటీన్ కలిగి ఉండటమే కాకుండా అన్నీ రకాల వంటకాల్లో ఇట్టే ఇమిడిపోగల గుణం వల్ల పన్నీర్ ప్రస్తుతం ప్రతి ఇంట్లో భాగమైపోయింది. అయితే పాల ఉత్పత్తుల్లో కల్తీ పద్ధతులు పెరుగుతున్న నేపథ్యంలో వినియోగదారుల్లో, నియంత్రణ సంస్థల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం వినియోగదారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో కల్తీ పనీర్ ఒకటి. ఈ కల్తీ పనీర్ చూడటానికి ఒరిజినల్ పనీర్ లాగానే ఉన్నా నాణ్యత, భద్రతా ప్రమాణాల విషయంలో చాలా దారుణంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ప్రముఖ ఆహార భద్రత సంస్థ ఖీూూూ× నిర్దేశించిన మార్గదర్శకాలు ఏంటి? ఇంట్లోనే సులభంగా కల్తీ పన్నీర్‌ను ఎలా గుర్తించాలి? వంటి విషయాలను తెలుసుకుందాం..

**కల్తీ పనీర్‌లో ఏం కలుపుతారంటే?**

ఒరిజినల్ పనీర్‌లా ఉండటం కోసం తక్కువ నాణ్యత గల పదార్థాలు, పాలు ఇతర వస్తువులతో కృత్రిమ పనీర్ తయారు చేస్తారు. బరువు కోసం స్టార్చ్ కలుపుతారు. దీంతో పోషక విలువలు తగ్గిపోతాయి. ఇక యూరియా, డిటర్జంట్ నీళ్లలో కలిపి ఈ మిశ్రమాన్ని తయారు చేస్తారు. ఇది అత్యంత ప్రమాదకరం.

**పనీర్ స్వచ్ఛమైనదని ఎలా చెప్పొచ్చు?**

తాజా పాలను బాగా వేడిచేసి నిమ్మరసం లేదా వెనిగర్ కలిపి విరగ్గొట్టే సాధారణ, సంప్రదాయ పద్ధతి ద్వారా స్వచ్ఛమైన పనీర్ తయారు చేస్తారు. ఈ స్వచ్ఛమైన పనీర్‌లో ఎలాంటి సింథటిక్, పాలేతర పదార్థాలు ఉండవు. ఇందులో ప్రొటీన్, కాల్షియం, శరీరానికి అవసరమయ్యే మంచి కొవ్వులు సమృద్ధిగా ఉంటాయి. అయితే ఖీూూూ× మార్గదర్శకాలను పాటించడం వల్ల పనీర్ నాణ్యత, భద్రతకు హామీ ఉంటుంది.

# రాగి దోశ ఇంట్లో సింపుల్‌గా ఎలా

మన తాత ముత్తాతలు రాగులు తినే బతికారు. కాల్షియం, ఐరన్, ఫైబర్ పుష్కలంగా ఉండే రాగులు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అయితే రాగులు అంటే చాలా మందికి గుర్తొచ్చేది రాగి సంగటి, రాగి జావ. కానీ రాగులతో రాగి సంగటి, రాగి జావ మాత్రమే కాదు. రాగి పిండితో చేసుకునే దోశలు కూడా టేస్ట్‌గా ఉండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. ఎక్కువ ప్రాసెస్ లేకుండా సింపుల్‌గా చేసుకునే అల్పాహారంలో ఇది కూడా ఒకటి. ఉదయం బ్రేక్?ఫాస్ట్ రెసిపీల్లో ఎక్కువ మంది ఇష్టపడే వాటిల్లో దోశ నెంబర్ వన్ స్థానంలో ఉంటుంది. అయితే సాధారణంగా మనం ప్లెయిన్ దోశ, మసాలా దోశ, రవ్వ దోశ, ఆనియన్ దోశ వంటివి ఎక్కువగా చేసుకుంటూ ఉంటాం. అయితే సాధారణంగా దోశ ప్రిపేర్ చేసుకోవాలి అనుకుంటే ముందు రోజే బియ్యం, పప్పులు నానబెట్టడం, వాటిని రుబ్బుకోవడం, పిండిని పులియబెట్టడం వంటి ప్రాసెస్ ఉంటుంది. ఇదంతా కాస్త శ్రమ, టైమ్‌తో కూడుకున్న పని. అయితే అలాంటి పనులేవీ లేకుండా అప్పటికప్పుడు ఇన్‌స్టెంట్‌గా ప్రిపేర్ చేసుకునే అద్దిరిపోయే బ్రేక్?ఫాస్ట్ రెసిపీ ఉంది. అదేమిటంటే.. రాగిపిండితో తయారు చేసే సూపర్ టేస్టీ ఇన్‌స్టెంట్ రాగి దోశలు. ఇవి మాంచి రుచికరంగా, క్రిస్పీగా ఉండడమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. ఆరోగ్యానికి హానికరమైన బేకింగ్ సోడా, బేకింగ్ పౌడర్ వంటివి వేయకుండానే ఈ రాగి దోశల పర్ఫెక్ట్?గా వస్తాయి. అనుభవం లేని వాళ్లు కూడా అప్పటికప్పుడు చాలా సింపుల్?గా ఈ రాగి దోశలు వేసుకోవచ్చు. మరెందుకాలస్యం సింపుల్ అండ్ టేస్టీ రాగి దోశలు ఎలా ప్రిపేర్ చేసుకోవాలి? అందుకు కావాల్సిన పదార్థాలు ఏంటి? ఈ దోశల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏంటి? వంటి విషయాలు తెలుసుకుందాం



# కిచెన్ సింక్ క్లీనింగ్ , ఈగలు తరిమికొట్టడం

వంటగది పనులు చూడటానికి ఈజీగా ఉండొచ్చు. కానీ చేసే వారికి తెలుస్తుంది ఆ కష్టం. వంటగదిలో మన అమ్మ లేదా భార్యలు ఎంతో కష్టపడుతుంటారు. వంట చేసేటప్పుడు లేదా పాత్రలు క్లీన్ చేసేటప్పుడు కొన్ని చిన్న చిన్న సమస్యలు ఎదురవుతుంటారు. వీటి వల్ల పని ఇంకా ఆలస్యం అవుతుంది. అయితే, ఇలాంటి వారి కోసం డిజిటల్ క్రియేటర్ చటోరి చట్నా కొన్ని చిట్కాల్ని షేర్ చేశారు. ఆ చిట్కాల్ని ఇప్పుడు తెలుసుకుందాం. ఇంట్లో హౌస్‌వైఫ్స్ అంటే గృహిణులు ఎక్కువ సమయం వంటగదిలోనే గడుపుతారు. వంట చేయడం, పాత్రల్ని క్లీన్ చేయడం ఇలా వివిధ రకాల పనుల్ని చేస్తూ సమయం గడుపుతుంటారు. చాలా వంటగది పనులకు సమయం పడుతుంది. కొన్ని కొన్ని పనులు చేయడం సవాల్‌గా ఉంటుంది. వంటగదిలో పనులు చేసేటప్పుడు చాలా చిన్న సమస్యలు తలెత్తుతుంటాయి. కొన్నిసార్లు పనిభారం అధికంగా మారవచ్చు. అలాంటి పరిస్థితుల్లో కొన్ని చిట్కాలు చాలా సాయపడతాయి. కొన్ని వంటింటి చిట్కాలు మీ పనిభారాన్ని తగ్గించగలవు.



**కిచెన్ సింక్ బేకింగ్ సోడాతో క్లీన్ చేయడం**

?వంటగదిలో కిచెన్ సింక్‌ని చాలా క్లీన్‌గా ఉంచుకోవాలి. ఎందుకంటే కిచెన్ సింక్‌లోనే మనం మురికి పాత్రల్ని ఎక్కువగా వేస్తుంటాం. దీంతో కిచెన్ సింక్‌లు తరుచుగా మురికిగా మారుతుంటాయి. అంతేకాకుండా ఈ సింక్స్ మూసుకుపోతాయి. ఇలాంటి సమయంలో మీకు బేకింగ్ సోడా సాయపడుతుందని చటోరి చట్నా చెబుతున్నారు. ఇందుకోసం సింక్‌లో కొద్దిగా బేకింగ్ సోడా చల్లుకోవాలి. దానిలో కొంత భాగం డ్రెయిన్ పైపులోకి వెళ్లే విధంగా చల్లుకోవాలి. ఆ తర్వాత దానిపైన వెనిగర్ పోసి కొంత సమయం అలాగే ఉంచండి. ఇలా చేయడం వల్ల కిచెన్ సింక్‌తో పాటు డ్రెయిన్ కొద్ది సమయంలో పూర్తిగా క్లీన్ అవుతుంది.

**ఇలా చేస్తే రోటీల్ని ఒక వారం పాటు నిల్వ చేయవచ్చు**

ఇంట్లో చపాతీలు లేదా రొట్టెలు చేయడం చాలా కష్టంతో కూడుకున్న పని. మొదట పిండి కలుపుకోవాలి. ఆ తర్వాత పిండి పిసుక్కోని రొట్టెలు ఒత్తుకోవాలి. ఆ తర్వాత చపాతీల్ని కాల్చుకోవాలి. ప్రతి రోజూ చపాతీలు చేయడం కష్టమనుకునేవారికి ఈ చిట్కా బాగా పనికొస్తుంది. పిండిలో పాలు కలిపి రొట్టెల్ని నొక్కుకోండి. ఆ తర్వాత ప్రతి రొట్టెను మరి ఎక్కువగా కాల్చకుండా లైట్‌గా కాల్చుకోండి. ఆ తర్వాత ప్రతి రోటీని ఒక చిన్న బేకింగ్ పేపర్‌తో లైన్ చేసి జిప్‌లాక్ బ్యాగ్‌లో స్టోర్ చేయండి. ఇలా చేయడం వల్ల మీరు చపాతీలు లేదా రొట్టెల్ని ఒక వారం పాటు ఫ్రీజర్‌లో నిల్వ చేయవచ్చు. మీరు చపాతీలు తినాలనిపించినప్పుడు వాటిని బయటకు తీసి కాల్చి తినండి. చాలా మంది ఇళ్లల్లో అప్పడప్పుడూ కేక్ తయారు చేసుకుంటారు. కేక్ తయారు చేసేటప్పుడు డ్రై ఫ్రూట్స్ లేదా బెర్రీలు వాడుతుంటారు. అయితే ఈ డ్రై ఫ్రూట్స్, బెర్రీలు కేక్ అడుగుకి వెళ్లిపోతాయి. పైన కనబడవు. మీకు పైకి ఇవి నీట్‌గా కనబడాలనుకుంటే డ్రైఫ్రూట్స్‌పై గోధుమ పిండి లేదా మైదా పిండి వేసి బాగా మిక్స్ చేయండి. ఆ తర్వాత కేక్ పిండిలో యాడ్ చేయండి. ఇలా చేయడం వల్ల కేక్ బేకింగ్ చేసిన తర్వాత అవి పై భాగంలో నీట్‌గా కనిపిస్తాయి. దీంతో, కేక్ అందంగా కనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో మిక్సీ బ్లేడ్ జామ్ అవుతుంటుంది. దీంతో పని చేయడం కొంచెం కష్టమవుతుంది. అయితే, ఇలాంటి సమయంలో ఫాలో అవ్వాల్సిన ఓ చిట్కా గురించి చటోరి చెట్నా చెప్పారు. ఇందుకోసం ముందుగా మిక్సీ కింది బ్లేడ్ చుట్టూ కొద్దిగా వాసెలిన్ అప్లై చేయండి. ఆ తర్వాత లోపలి బ్లేడ్‌కి కొద్దిగా నూనె రాయండి. ఇప్పుడు మిక్సీ జార్‌లో కొంచెం గోరువెచ్చని నీరు పోసి మిక్సర్ నడపండి. ఆ తర్వాత మిక్సీ బాగానే రన్ అవ్వడం మీరు గమనించవచ్చు. మీరు ఇంట్లో గమినించే ఉంటారు. పండ్ల చుట్టూ కొన్ని ఈగలు గుంపులుగా తిరుగుతుంటాయి. వీటిని ఫ్రూట్ ఫ్లైస్ అంటారు.

# ప్రెగ్నెన్సీ సమయంలో మొబైల్ ఫోన్ ఎలా వాడాలి?



ఈ రోజుల్లో టెక్నాలజీ మన జీవితంలో ఒక భాగమైంది. చాలా మంది ఫోన్ వాడకుండా ఉండలేకపోతున్నారు. ఇక, ప్రెగ్నెన్సీ సమయంలో మొబైల్ ఫోన్ వాడొచ్చా లేదా అన్న అనుమానం చాలా మందికి ఉంటుంది. ప్రెగ్నెన్సీ సమయంలో మహిళలు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. తినే ఆహారం దగ్గర నుంచి వాడే ఫోన్ వరకు చాలా జాగ్రత్తలు పాటించాలి. అయితే, ప్రెగ్నెన్సీ సమయంలో పూర్తిగా ఫోన్ మానేయాల్సిన పనిలేదని డాక్టర్ ఎస్. పల్లవి. కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డ ప్రసూతి వైద్యులు తెలిపారు. అయితే, వాడే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఆమె వివరించారు. ప్రెగ్నెన్సీ సమయంలో ఫోన్ ఎలా వాడాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో తెలుసుకుందాం. ప్రెగ్నెన్సీ అనేది మహిళలకు ఒక అందమైన దశ. ఈ సమయంలో మహిళలు ఎన్నో సమస్యల్ని ఎదుర్కొంటారు. శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు పడతారు. అందుకే ఈ సమయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. గర్భధారణ సమయంలో మొబైల్ ఫోన్ వాడకం గురించి చాలా మంది గర్భిణీ స్త్రీలకు ఉండే సందేహమే. ప్రస్తుత శాస్త్రీయ ఆధారాల ప్రకారం, మొబైల్ ఫోన్ వాడకం వల్ల పుట్టబోయే బిడ్డకు హాని జరుగుతుందని చెప్పడానికి ఎటువంటి ఖచ్చితమైన ఆధారాలు లేవని డాక్టర్ ఎస్. పల్లవి. కన్సల్టెంట్ గైనకాలజిస్ట్ డ ప్రసూతి వైద్యులు, అంకురా హాస్పిటల్ తెలిపారు. అయితే, కొన్ని జాగ్రత్తలు పాటించడం ఎప్పుడూ మంచిదే. అవి ఏంటి, మొబైల్ ఎలా వాడాలి అన్న పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. అందుకే తినే ఆహారం నుంచి ప్రతి ఒక్క విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రెగ్నెన్సీ సమయంలో స్మార్ట్ ఫోన్ లేదా మొబైల్ వాడకం గురించి చాలా మంది మహిళలకు సందేహాలు ఉంటాయి. పుట్టబోయే బిడ్డకు ఏమైనా జరుగుతుందా అని ఆందోళన చెందుతుంటారు.

**నిద్ర నాణ్యత ముఖ్యం**

మొబైల్ స్క్రీన్ నుంచి వచ్చే బ్లూ లైట్ నిద్రకు ఆటంకం కలిగిస్తుంది. బ్లూ లైట్ నిద్ర సైకిల్ నియంత్రించే హార్మోన్ అయిన మెలోటినిన్‌ని కంట్రోల్ చేస్తుంది. దీంతో, నిద్ర సైకిల్ దెబ్బతింటుంది.

రాత్రి పడుకునే ముందు ఫోన్ వాడటం వల్ల నిద్ర సరిగ్గా పట్టదు. గర్భిణీలకు సరైన నిద్ర చాలా అవసరం. పడుకునే కనీసం ఒక గంట ముందు ఫోన్‌ను పక్కన పెట్టడం మంచి అలవాటు. అంతేకాకుండా లైట్స్ ఆఫ్ చేసి ఫోన్ చూడకండి.

**ఫోన్ విషయంలో కొన్ని ముఖ్యమైన సూచనలు**

విషయం తీసుకోవాల్సిన జాగ్రత్త. కాల్స్ వీలైనంత వరకు చిన్న మాట్లాడండి. హెడ్ సెట్ లేదా స్పీకర్ ఉపయోగించండి. సిగ్నల్ సిగ్నల్ తక్కువగా ఉన్నప్పుడు ఫోన్ వాడకండి. సిగ్నల్ తక్కువగా ఉన్నప్పుడు రేడియేషన్ కొంచెం ఎక్కువగా ఉంటుంది. రాత్రి సమయం నైట్ మోడ్ ఆన్ చేయండి. స్క్రీన్ లైటింగ్ తగ్గించండి. రాత్రి పడుకునే గంట ముందు ఫోన్‌ను దూరం పెట్టండి. విశ్రాంతి ఫోన్ కంటే కూడా నడక, మంచి పుస్తకాలు చదవడం వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వండి. గర్భధారణ సమయంలో సరైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.